RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 284 శనివారం 8 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

### ఎయిర్ పోర్ట్‌లో సాంకేతిక సమస్య.. 100కు పైగా విమానాలు ఆలస్యం

ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థ లో టెక్నికల్ ప్రాబ్లెమ్ తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దాదాపు 100కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రయాణికులందరూ వారి వారి విమానయాన సంస్థలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఢిల్లీ ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్‌లో 100కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయని ఎయిర్‌పోర్ట్ అధికారిక వర్గాలు తెలిపాయి. విమానాల షెడ్యూల్ మార్పునకు సంబంధించి ఎయిర్‌లైన్లు ఇండిగో, స్పైస్‌జెట్, ఎయిరిండియా ప్రయాణికులకు అడ్వైజరీలు జారీ చేశాయి. విమానాల ప్రయాణం ఆలస్యం కావడంతో ఎయిర్ పోర్టులోని చెక్‌ఇన్, ఇతర కౌంటర్ల వద్ద భారీ రద్దీ నెలకొంది.

# వందేమాతరం ఒక శక్తి..!

## నవంబర్ 7 చారిత్రాత్మక దినం

## వందేమాతరం 150వ ఆవిర్భావ దినోత్సవంలో ప్రధాని మోది






ఢిల్లీ : వందేమాతరం అనేది ఒక మంత్రం.. ఒక కల.. ఒక సంకల్పం.. ఒక శక్తి అని ప్రధాని మోడీ అన్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చరిత్రకు గుర్తుగా స్మారక తపాలా బిళ్ళ, స్మారక నాణెంను మోడీ ఆవిష్కరించారు. అనంతరం మోడీ ప్రసంగించారు. "వందేమాతరం అనేది ఒక మంత్రం. ఒక కల. ఒక సంకల్పం. ఒక శక్తి. ఇది దేశానికి ఒక ప్రార్ధన. ఇది మనల్ని చరిత్రలోకి తీసుకెళుతుంది. ఇది మన భవిష్యత్తుకు ధైర్యాన్ని ఇస్తుంది. భారతీయులు సాధించలేని సంకల్పం లేదు. సాధించలేని లక్ష్యం లేదు." అని మోడీ పేర్కొన్నారు. నవంబర్ 7 అనేది ఒక చారిత్రాత్మక రోజు అని.. వందేమాతరం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి శుభాకాంక్షలు తెలిపారు.

**వందేమాతరం చరిత్ర ఇదే..** వందేమాతరం గేయాన్ని 1875లో సరిగ్గా నవంబర్ 7న అక్షయ్ నవమి పండుగ రోజున.. ప్రముఖ బెంగాలీ కవి బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఇది బంకించంద్ర రచించిన "ఆనంద్ మఠ్" నవలలో అంతర్భాగంగా ఉంది. తొలిసారిగా "బంగాదర్శన్" అనే సాహిత్య పత్రికలో ప్రచురించబడింది.

భారత స్వాతంత్రోద్యమంలో ఈ గేయం కీలక పాత్ర పోషించింది. అత్యంత వేగంగా దేశ భక్తికి ప్రతీకగా మారి స్వాతంత్రోద్యమాన్ని ఉత్తేజపరిచింది. ఇక 1950లో భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన సందర్భంగా ఈ "వందేమాతరం" గేయాన్ని "జాతీయ గేయంగా" గుర్తించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ 2025 సంవత్సరాన్ని 150 ఏళ్ల "వందే మాతరం"గా పరిగణించింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది 2026, నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా వందేమాతరం జాతీయ గేయం సంస్మరణోత్సవాలను జరపాలని నిర్ణయించింది.

**ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల...** వందేమాతరం గేయం 150వవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణెం, స్మారక తపాలాబిళ్లను విడుదల చేశారు. దీంతోపాటు జాతీయ గేయానికి సంబంధించి '150.ఇన్(150.in)' అనే ఓ స్పెషల్ పోర్టల్‌నూ ఆయన ఆవిష్కరించారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వందేమాతరం సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. 'వందేమాతరం' అనే పదం మన వర్తమానంలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తిస్తుందని, తద్వారా మనం సాధించలేని లక్ష్యమంటూ ఏదీలేదనే ధైర్యాన్నిస్తుందని చెప్పారు.

ఫలితంగా కోట్లాది మంది భారతీయుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని ఉద్ఘాటించారు. మోదీకి మద్దతుగా సమాజంలోని అన్నివర్గాల పౌరులు బహిరంగ ప్రదేశాల్లో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా అనగా 2026 నవంబర్ 7 వరకూ నిర్వహించాలని మోదీ పిలుపునిచ్చారు. దీనికోసం ఈ ఏడాది అక్టోబర్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. దేశపౌరుల్లో ముఖ్యంగా యువతలో విప్లవాత్మక స్ఫూర్తిని రగిలించే ఈ గేయంను ఏడాది పాటు ఓ ప్రత్యేక కార్యక్రమంలా నిర్వహించడం వల్ల భావితరాల హృదయాల్లో చిరకాలం నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా, సీఎం రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు. 1875 నవంబర్ 7వ తేదీన అక్షయ నవమి శుభ సందర్భంగా.. బంకిం చంద్ర ఛటర్జీ రచించిన 'ఆనంద్‌మఠ్' నవలలోని 'వందేమాతరం' గేయం తొలుత 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఈ గేయం ఎంతగానో స్ఫూర్తినిచ్చింది.




# భారత్ వైపు ట్రంప్ చూపు...

## స్నేహానికి చేయి చాస్తున్న అగ్రరాజ్యాధినేత

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటనకు సిద్ధమవుతున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే అవకాశం ఉంది. ఈ విషయంపై స్వయంగా హింట్ ఇచ్చిన ట్రంప్.. ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్– అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. బరువు తగ్గించే మందుల ధరలను తగ్గించడానికి సంబంధించి కొత్త ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా వైట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీతో వాణిజ్య చర్చలు చాలా బాగా జరుగుతున్నాయని తెలిపారు. 'మోదీ రష్యా నుంచి చమురు కొనడం చాలావరకు మానేశారు. ఆయన నాకు గొప్ప స్నేహితుడు. మా మధ్య చర్చలు జరుగుతున్నాయి. నేను అక్కడికి రావాలని ఆయన కోరుకుంటున్నారు. మేము దాన్ని పరిశీలిస్తున్నాం. నేను వెళ్తాను. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి' అని ట్రంప్ అన్నారు. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది భారత్‌లో పర్యటించాలని మీరు ప్లాన్ చేస్తున్నారా? అని ఓ విలేకరి ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'అలా కావొచ్చు. అవును' అని పేర్కొన్నారు. కాగా.. ట్రంప్ పర్యటనపై వైట్‌హౌస్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

**వైట్‌హౌస్‌లో అనూహ్య ఘటన..** ప్రముఖ ఊబకాయం మందుల ధరల తగ్గింపు లక్ష్యంగా పలు ఫార్మా కంపెనీలతో ట్రంప్ కీలక ఒప్పం దం చేసుకున్నారు. ఈ ఒప్పందం గురించి వైట్‌హౌస్‌లో విలేకరులకు వివరిస్తుండగా.. అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ట్రంప్ పక్కన ఉన్న.. ఓ ఫార్మాస్యూటికల్ ఎగ్జిక్యూటివ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయా రు. దీంతో కార్యక్రమానికి కొంతసేపు అంతరాయం కలిగింది. పడిపో యిన వ్యక్తి నోవో నార్డిస్క్ ఎగ్జిక్యూటివ్ గోర్డాన్ ఫైండ్లేగా తెలుస్తోంది. ఈ సంఘటనపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ మాట్లాడు తూ.. ఆయన స్పృహ తప్పారని వెల్లడించారు. వైట్‌హౌస్ వైద్యబృందం వెంటనే స్పందించి ఆయనకు చికిత్స అందించినట్లు తెలిపారు.




హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. శుక్రవారం హైదరాబాద్‌లో ఈ అంశంపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చలు జరిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల పట్ల ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. దీంతో శనివారం నుంచి ప్రైవేట్ కళాశాలు తెరుచుకోనున్నాయి.

**డిప్యూటీ సీఎం మల్లు..** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కళాశాలలు అడిగిన రూ. 1,500 కోట్లలో రూ. 600 కోట్లు ఇప్పటికే విడుదల చేశామని గుర్తు చేశారు. మరో రూ. 600 కోట్లు వెంటనే విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. మిగిలిన రూ. 300 కోట్లు త్వరలో క్లియర్ చేస్తామని చెప్పారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కమిటీలో ఉన్నతాధికారులు, కళాశాల యాజమాన్య ప్రతినిధులు సభ్యులుగా ఉంటారన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే హైదరాబాద్ అభివృద్ధి!

## తెలంగాణ అభివృద్ధిని కిషన్‌రెడ్డి, కేటీఆర్ అండ్ కో అడ్డుకుంటున్నారు..

## జూబ్లీహిల్స్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలి : సీఎం రేవంత్




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విన్నవించారు. పదేళ్లలో జూబ్లీహిల్స్‌కు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఏం చేశాయని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ అభివృద్ధి పథంలో సాగిందని ఉద్ఘాటించారు. ఎవరి హయాంలో హైదరాబాద్ అభివృద్ధి జరిగిందో జూబ్లీహిల్స్ ఓటర్లు ఆలోచించాలని కోరారు. 2014 నుంచి హైదరాబాద్‌లో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని ఆరోపించారు. ఈ ఎన్నికలో ప్రజలు ఆలోచనతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తమ పాలన, బీఆర్ఎస్ పాలన చూసి బేరీజు వేసుకొని ఓటు వేయాలని విన్నవించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి..** హైదరాబాద్ అభివృద్ధి కాంగ్రెస్ పాలనలో చేసిందేనని ఉద్ఘాటించారు. ఇవాళ(శుక్రవారం)గాంధీభవన్ వేదికగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. సచివాలయంలో ఉన్న గుడి, మసీదులను కూలగొడితే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే అనేక విద్యాసంస్థలను నెలకొల్పిందని నొక్కిచెప్పారు. కాంగ్రెస్ నిర్ణయాలతోనే హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా మారిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ అభివృద్ధి గ్రోత్ ఇంజన్‌గా ఉందని చెప్పుకొచ్చారు. మిగులు బడ్జెట్‌తో మాజీ సీఎం కేసీఆర్‌కి అధికారం అప్పగిస్తే రూ. 8 .11 లక్షల కోట్ల అప్పును తమకు అప్పగించారని ఫైర్ అయ్యారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలోనే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2024లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మాజీ సీఎం కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కలిసి హైదరాబాద్ అభివృద్ధి చెందడానికి ఏం చేశారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ సేద తీరడానికి ప్రగతి భవన్ ఉపయోగపడిందని ఎద్దేవా చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

**ప్రగతి భవన్ ఏమైనా ఉపయోగపడిందా..?..** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రగతి భవన్ ఏమైనా ఉపయోగపడిందా..? అని నిలదీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న సచివాలయం వాస్తుని చూసే కూలగొట్టారని ఆరోపించారు. కొత్త సచివాలయం వల్ల ప్రజలకు అదనపు లాభం ఏమీ లేదని స్పష్టం చేశారు. కొత్త సచివాలయం కట్టడం వల్ల ఒక్క ఉద్యోగమైనా వచ్చిందా..? అని ప్రశ్నించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో ప్రతిపక్ష నాయకుల ఇళ్ల ముందు సీసీ కెమెరాలు పెట్టి చూడటం తప్పా కేసీఆర్ చేసిందేమీ లేదని సెటైర్లు గుప్పించారు. బాత్ రూంలో కూడా బుల్లెట్ ప్రూఫ్‌లు పెట్టుకున్నది కేసీఆరేనని ఎద్దేవా చేశారు. ఈ పదేళ్లలో తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి చేసిన ప్రణాళిక ఏమైనా ఉందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**తెలంగాణ 2047 పేరుతో విజన్ డాక్యుమెంట్..** తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి , కేటీఆర్ అండ్ కోనేనని ఆరోపించారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీలను అడ్డుకుంటుంది కేటీఆర్, కిషన్‌రెడ్డిలేనని విమర్శించారు. తెలంగాణ 2047 పేరుతో తాము విజన్ డాక్యుమెంట్‌ని రూపొందిస్తున్నామని ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో జీహెచ్ఎంసీపై రూ.10 వేల కోట్ల అప్పు చేశారని ఆరోపణలు చేశారు. హైదరాబాద్ దాహార్తి తీర్చేందుకు బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయం ఏముందని ప్రశ్నించారు. ఎల్ అండ్ టీ మునగడానికి కారణం కేసీఆర్, కేటీఆర్ మాత్రమేనని ఆక్షేపించారు. ఎల్ అండ్ టీ కంపెనీని బ్లాక్ మెయిల్ చేసి కేసీఆర్, కేటీఆర్ లక్షలాది రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. ఫ్లై ఓవర్ విధానాన్ని తెచ్చిందే కాంగ్రెస్ పార్టీనేనని నొక్కిచెప్పారు. కేసీఆర్ హయంలో ఓ ఆర్ ఆర్‌ను దారుణంగా అమ్ముకున్నారని విమర్శించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**ఆ సంస్థలన్నీ కాంగ్రెస్ హయాంలోనివే..** నేడున్న జాతీయ, అంతర్జాతీయ సంస్థలన్నీ కాంగ్రెస్ హయాంలోనివేనని స్పష్టం చేశారు. ఐటీ కారిడార్‌ను రద్దు చేసింది మోదీ, కేసీఆర్ కాదా..? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి కిషన్‌రెడ్డి ఏం తెచ్చారు..? అని నిలదీశారు. గత పదేళ్లలో తెలంగాణకు కేసీఆర్, కిషన్‌రెడ్డి చేసిందేంటో చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రాజెక్టులను ప్రధాని మోదీ రద్దు చేశారని ధ్వజమెత్తారు. కిషన్‌రెడ్డి, కేటీఆర్ తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**వారు బ్యాడ్ బ్రదర్స్...** కేటీఆర్ అండ్ కో మెట్రో విస్తరణను అడ్డుకుంటున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ అండ్ కోని హైదరాబాద్ వాసులు బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం మూడేళ్లలోనే జరిగిపోయాయని సెటైర్లు గుప్పించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి రూ.లక్ష కోట్లు గోదావరిలో పోశారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయం, కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్ సెంటర్.. ప్రగతి భవన్ తప్పా పదేళ్లలో కేసీఆర్ ఏం నిర్మించారని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ విలాసవంతమైన జీవితం గడిపేందుకే ప్రగతిభవన్ కట్టారని ఆక్షేపించారు. కుమారుడి భవిష్యత్, వాస్తు కోసమే.. రూ.2 వేలకోట్లతో కేసీఆర్ కొత్త సచివాలయం కట్టారని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో కేసీఆర్ ఒక్క కొత్త ఎయిర్‌పోర్టు అయినా కట్టారా అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**మా ప్రభుత్వంలోనే తెలంగాణకి పెట్టుబడులు..** 'మేము అధికారంలోకి వచ్చాకే తెలంగాణ పెట్టుబడులు వస్తున్నాయి. గత రెండేళ్లలో తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ప్రజలకు ఉపయోగం లేని ప్రాజెక్టులు నిర్మించిన బీఆర్ఎస్.. ఇప్పటికీ వాటిని చూపించి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే. మేం వచ్చాక 70 వేల ఉద్యోగాలు కల్పించాం. తెలంగాణకు కేటీఆర్ తీసుకొచ్చింది డ్రగ్స్, గంజాయి మాత్రమే. కేటీఆర్ ఒక విషపురుగు.. విష సంస్కృతిని తీసుకొస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలంటే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలవాలి' అని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం..** కేటీఆర్, కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'గత పదేళ్లలో మీరుచేసిన అభివృద్ధి, తెచ్చిన ప్రాజెక్టులపై చర్చకు సిద్ధం. నగర అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు అడ్డంకిగా మారారు. తెలంగాణకు కేటీఆర్ తీసుకొచ్చింది డ్రగ్స్, గంజాయి మాత్రమే. కేటీఆర్ ఒక విషపురుగు.. విష సంస్కృతిని తీసుకొస్తున్నారు. హైదరాబాద్ నగరంలో అత్యాచారాలకు అవే కారణం కాదా?. నగరాన్ని పరిరక్షించి అభివృద్ధి చేసేందుకే హైడ్రా తీసుకొచ్చాం. హైడ్రా ద్వారా ఆక్రమణల నుంచి చెరువులు, పార్కులను కాపాడుతున్నాం. ఆక్రమణలపై మాత్రమే హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. అక్కడక్కడ పేదలకు ఇబ్బంది కలిగితే న్యాయం చేస్తున్నాం. ఈగల్, హైడ్రా వ్యవస్థలపై కేటీఆర్, కిషన్‌రెడ్డి కక్షగట్టారు' అని ధ్వజమెత్తారు.

# సంపాదకీయం

## ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాలు... రీజన్ ఇదే !

ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు ఇపుడు ఎంతో ఆకర్షణగా ఉన్నాయి. అంతే కాదు ఓట్ల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఎన్నికల్లో గెలుపునకు ఇది దగ్గర మార్గంగా చేసుకుని నేతాశ్రీలు భారీ ఎత్తున హామీలను గుప్పిస్తున్నారు. ఆ తరువాత వాటిని అమలు చేయలేక అప్పులు తెస్తున్నారు. అలా రాష్ట్రాలు అప్పులు కుప్పలుగా మారుతున్నాయి. ఖజానాకు చిల్లు పడుతోంది. కానీ రాజకీయమే గెలుస్తోంది. దాంతో అభివృద్ధిని పక్కన పెట్టి నగదు బదిలీ ప్రవాహం అలా సాగిపోతూనే ఉంది. ప్రారంభంలో ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితం అయిన ఈ వ్యవహారం కాస్తా ఇపుడు దేశంలోని సగానికి పైగా రాష్ట్రాలకు విస్తరించింది. దీంతో ఈ పెడ ధోరణులకు స్వస్తి పలకకపోతే ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరికలు అయితే వస్తున్నాయి.

**కుదేల్ అవుతున్న ఖజానా :** దేశంలో వివిధ పథకాలను రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్నాయి. చేతికి ఎముక లేకుండానే ఇదంతా సాగుతోంది. అంతే కాదు రేపు ఏమి జరుగుతుంది అన్నది కూడా చూసుకోకుండా ఎవరికి వారుగా జోరు చేస్తున్నారు. గెలవడమే ముఖ్యం. కుర్చీయే లక్ష్యం కాబట్టి దాని కోసమే చేయాల్సింది అంతా చేస్తున్నారు. ఇక మరీ ముఖ్యంగా తీసుకుంటే మహిళలు కేంద్రంగా అమలు చేస్తున్న నగదు బదిలీ పథకాలతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయని టోటల్ గా కుప్పకూలుతున్నాయని ఒక అధ్యయనంలో కఠిన వాస్తవాలు బయటపడుతున్నాయి.

**దిగజారిపోతున్నా :** ఆ మధ్య దాకా మిగులు బడ్జెట్ తో ఎంతో బాగా ఉన్న రాష్ట్రాలు సైతం ఇపుడు రెవిన్యూ లోటుతో దిగజారిపోతున్నాయని ఈ అధ్యయనం తేల్చింది. ఇదంతా కూడా పథకాల మహిమ అని కూడా స్పష్టం చేసింది. ఇదంతా ఇటీవల కాలంలోనే జరుగుతోంది అని అంటోంది. మూడు నాలుగేళ్ళ క్రితం వరకూ చూస్తే దేశంలో అక్కడో ఇక్కడో రాష్ట్రంలో మాత్రమే ఈ పథకాలు అమలు అయ్యేవి. అయితే దాని వల్ల ఓట్ల పంట పండుతోందని రాజకీయంగా ఎంతో బాగుందని గ్రహించిన మిగిలిన రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలు కూడా అదే బాట పట్టాయి దాంతో ఆర్థిక వ్యవస్థలు అన్నీ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని ఆ అధ్యయనం పేర్కొనడం ఒక పెను సంకేతమే.

**లక్షల కోట్లు అటే :** ఈ అధ్యయనం ప్రకారం చూస్తే ప్రస్తుత బడ్జెట్ లో ఈ రాష్ట్రాలు మొత్తం ఒక లక్షా 68 వేల కోట్ల రూపాయలు కేవలం పథకాలకే కేటాయిస్తున్నాయని లెక్క చెప్పింది పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే సంస్థ తన అధ్యయనం ద్వారా అని అంటున్నారు.

ఇప్పటికే చాలా రాష్ట్రాలు ఆర్థికంగా ఊపిరి ఆడని స్టేజికి చేరుకున్నాయని కూడా ఈ నివేదిక తేటతెల్లం చేసింది.

**రెవిన్యూ లోటు నమోదు :** ఇక సగానికి సగం రాష్ట్రాలు ఈ ఆర్థిక సంవత్సరంలోనే రెవిన్యూ లోటుని నమోదు చేశాయని కూడా అసలు విషయం బయటపెట్టింది. ఇదంతా ప్రత్యక్ష నగదు బదిలీ పథకం పుణ్యమే అని అంటోంది. ఈ ధోరణి వల్ల ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా ఉందని దానిని సవరించుకోకపోయినట్లు అయితే భవిష్యత్తు చాలా ఇబ్బందిలో పడుతుందని కూడా హెచ్చరిస్తోంది. అయితే ఒక వైపు నివేదికలు ఇలా వస్తున్నా ప్రతీ ఎన్నికల్లో అలవి కాని హామీలు ఇస్తూ పోతున్నారు. అది అలాగే సాగుతోంది. ఇది ఆగేది ఉందా అంటే దానికి జవాబు ఎవరూ ఇప్పట్లో చెప్పలేరేమో.

# న్యాయవాదుల సౌకర్యార్థం వెల్ఫేర్ స్టిక్కర్ స్థానంలో క్యూ ఆర్ కోడ్ తో డిజిటలైజేషన్ చేయిస్తాను

## హైకోర్ట్ అడ్వకేట్, బార్ కౌన్సిల్ అభ్యర్థి రాపోలు భాస్కర్







స్టేట్ బ్యూరో (గరుడ వార్త) : న్యాయవాదులకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ వంటి ఎన్నో సంక్షేమాల కల్పననే సంకల్ సంకల్పంగా ముందుకు సాగుతున్నానని ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. రాబోయే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ బార్ కౌన్సిల్ అభ్యర్థి, హైకోర్టు అడ్వకేట్ రాపోలు భాస్కర్ తన అభ్యర్థిత్వాన్ని తెలియజేయుటకు కరీంనగర్, పెద్దపల్లి, సుల్తానాబాద్ తోపాటు ఇతర కోర్ట్ ఆవరణలో న్యాయవాదులను కలిశారు. దీంతో బార్ అసోసియేషన్ సభ్యులు ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ కు స్వాగతం పలుకగా, పెద్ద ఎత్తున న్యాయవాదులు హాజరై అండగా నిలుస్తామంటూ భరోసానిచ్చారు.

ఈ సందర్భంగా సందర్భంగా ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ... న్యాయవాదుల సౌకర్యార్థం తాను గెలుపొందిన తరువాత వెల్ఫేర్ స్టిక్కర్ స్థానంలో K QR CODE నీ పెట్టి, డిజిటలైజెషన్ చేయించేందుకు తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కోర్టుల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ మరియు జూనియర్ అడ్వకేట్స్, అడ్వకేట్ ఫెడరేషన్ల తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతర గీతం భారత వారిని జాగృతం చేసింది: ఎంపీ ఈటెల



శామీర్ పేట, నవంబర్ 7 ( గరుడ వార్త ) : వందేమాతర గీతం యావత్ భారత జాతిని జాగృతం చేసిందని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. వందేమాతర గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన వందేమాతర గీతాలాపన కార్యక్రమంలో ఎంపీ ఈటెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ: బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం, పింగళి వెంకయ్య మూడు రంగుల జెండా, రవీంద్రనాథ్ ఠాగూర్ జనగణమన మనకు అందించారని తెలిపారు. పరాయి పాలన కింద నలిగిపోతున్న జాతిని ఏకం చేయడానికి ఇవన్నీ ఉపయోగపడ్డాయని, భరతమాత బానిస శృంఖలాలు తెంచడానికి వందల సంవత్సరాల పాటు లక్షల మంది భరతమాత ముద్దుబిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. లక్షలాదిమంది అండమాన్ లాంటి నికృష్టమైన జైళ్లలో మగ్గారని, కోట్లమంది గాంధీ నాయకత్వంలో, సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో పోరాడారని తెలిపారు. భగత్ సింగ్ రాజగురు సుఖ్దేవ్, ఆజాద్ చంద్రశేఖర్ లాంటి వారు సైతం తమ ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఝాన్సీ రాణి చిన్న పిల్లని ఎత్తుకొని ఈ జాతి విముక్తి కోసం ఎలా కత్తి పట్టి యుద్ధం చేసిందో ఫోటోలు చూస్తూ ఉంటామని చెప్పారు. మనం వింటున్న ఈ గీతం ఆనాడు నిషేధించబడిందని, ఆనాడు మువ్వన్నెల జెండా ఎత్తాలంటనే ప్రాణం గాలిలో కలిసిపోయేదన్నారు. ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, మనం ఎగరవేస్తున్న మూడు రంగుల జెండా ఊరికే వచ్చింది కాదని, అనేక త్యాగాలు చేస్తే వచ్చిందని తెలిపారు. జమ్మూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి అరుణచల ప్రదేశ్ వరకు జాతులు వేరైనా, భాషలు వేరైనా, సంస్కృతులు సాంప్రదాయాలు వేరైనా అందరం భారతమాత బిడ్డలం అనే భావన ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. జాతిని ఐఖ్యంగా ఉంచే, మనల్ని కలిసి ముందుకు నడిపించేది మనలో ఉన్న దేశభక్తి అన్నారు. ప్రపంచ చిత్రపటం మీద భారత జాతి ఆత్మ గౌరవాన్ని ఆవిష్కరించాలంటే మనలో ఆ దేశభక్తి లేకపోతే సాధ్యం కాదని, ఒకప్పటి మన పురాణాల చరిత్ర ప్రపంచంలోనే భారతదేశం విశ్వగురు స్థానంలో ఉందని చదువు కుంటున్నామన్నారు. పరాయి పాలన కింద హింసకు గురిచేసి సంస్కృతిని, సాంప్రదాయాలను ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయత్నం చేశారని, మనం వాటిని కాపాడుకున్నామని చెప్పారు. దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలవుతుందని, మన పిల్లలు ఎంత చదువుకున్న, ఎంత ఎత్తుకు ఎదిగిన మనందరం భారతీయులం, భారతమాత ముద్దు బిడ్డలం అనే భావన లేకపోతే మనం ఐక్యంగా ముందుకు సాగలేమన్నారు. ప్రపంచంలో అనేక దేశాల ఎలా విచ్చిన్న మవుతున్నాయో, ప్రశాంతత లేకుండా యుద్ధాలు జరుగుతున్నాయో చూస్తున్నామని తెలిపారు. 140 కోట్ల ప్రజలున్న ఇన్ని వైవిధ్యాలు ఉన్నప్పటికీ మనం కలిసి మెలిసి జీవించడానికి మహనీయులు అందించి నటువంటి ఇలాంటి గీతాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మన పిల్లల్లో ఆ జాతీయత దేశభక్తిని నేర్పించాలని సూచించారు. ఇందులో భాగంగానే నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారని, భారత జాతి ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఇవన్నీ తలుచుకుంటూ మనం పునరంకితం కావాలని, ప్రధానమంత్రి ఇచ్చిన సందేశాలను, ఆదేశాలను దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అందరికీ 150 వసంతాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, గోపు రమణ రెడ్డి, నెహ్రూ నాయక్, రాస వెంకట్, సురేష్ యాదవ్, తెలంగాణ సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వందేమాతర గీతం 150 వసంతాల ఉత్సవాలు

శామీర్ పేట, నవంబర్ 7 ( గరుడ వార్త) : వందేమాతర గీతం 150 వసంతాల ఉత్సవాలను పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మూడుచింతపల్లి మున్సిపల్ కమిషనర్ జే పవన్ కుమార్ ఆధ్వర్యంలో150 సంవత్సరాల వందేమాతరం ఉత్సవాలు ఎస్ ఎస్ ఆర్ స్కూల్ విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. మూడు చింతలపల్లి లో భారీ జాతీయ జెండాను విద్యార్థులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అలాగే తూంకుం





ట మున్సిపల్‌లో కమిషనర్ జ్యోతి ఆధ్వర్యంలో వందేమాతర గీతం150 వసంతాల వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ మేనేజర్ ఉష, రెవెన్యూ ఆఫీసర్లు రాజేశ్వర్ రెడ్డి, గౌతమీ, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్, బిల్ కలెక్టర్లు, ఎస్ ఎస్ ఆర్ స్కూల్ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు ...

శామీర్ పేట, నవంబర్ 7 ( గరుడ వార్త ) : నాణ్యమైన విత్తనాలను విత్తుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని సీనియర్ ప్రొఫెసర్, మేడ్చల్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరం లో క్షేత్ర దినోత్సవం లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం టీ యు 1010 రకాన్ని గత జూన్లో ఒక్కొక్క గ్రామంలో ముగ్గురు రైతులకు 10 కిలోలు చొప్పున అందజేసినట్లు తెలిపారు. ఈ నాణ్యమైన విత్తనంతో అధిక దిగుబడులు





సాధించవచని, వాటిని తోటి రైతులకు అందజేసి అధిక దిగుబడులతో పాటు అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. మూల విత్తనంలోని ప్రాముఖ్యత గురించి, వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టే కార్యక్రమాల గురించి రైతులకు తెలియజేశారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలు అందించడంతోపాటు వివిధ రకాల సబ్సిడీలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రమావత్ బాలాజీ నాయక్, వ్యవసాయా ధికారి రవికుమార్, విస్తరణాధికారి సురేష్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, భవాన్స్ కాలేజ్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల భారీ ఆపరేషన్.. ఒక్క నెలలో 55 మంది అరెస్టు

హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల ఆగడాలను అరికట్టేందుకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ చేపట్టారు. అక్టోబర్ నెలలో 196 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి.. 55 మందిని అరెస్టు చేశారు. బాధితులకు రూ. 62.34 లక్షలు అప్పగించారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో రూ. 107 కోట్ల లావాదేవీలు గుర్తించారు. వివిధ కేసుల్లో 8 రాష్ట్రాలకు చెందిన 55 మంది సైబర్ మోసగాళ్లను అరెస్టు చేసినట్లు శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. చైనా పౌరుల ద్వారా డిజిటల్ అరెస్టు స్కామ్ చేస్తున్నట్లు గుర్తించారు. 62 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ. 1.07 కోట్లు దోచుకున్న ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో అరెస్టు చేశారు. అదృశ్యమైన ఫోన్ ద్వారా ముగ్గురు నిందితులు రూ. 1.95 లక్షలు దోచుకోగా వారిని కూడా అరెస్టు చేశారు. ఏపీలో ఫేక్ ట్రేడింగ్ యాప్‌తో రూ. 24.17 లక్షలు మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్టు, సోషల్ మీడియా ఫ్రాడ్‌ల ద్వారా 33 సైబర్ మోసాలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుంచి 31 సెల్‌ఫోన్లు, 14 చెక్‌బుక్‌లు, 9 డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

# 'గెల'గిలా కొట్టుకున్నా.. ముమ్మాటికీ అక్రమమే..!

అశ్వారావుపేట : ఆయిల్‌పాం గెలల రవాణాలో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. ఎకరాకు సగటున 157.81 టన్నుల దిగుబడి సాధించినట్లు దంపతులిద్దరూ అక్రమంగా రికార్డులు సృష్టించారు. అందులో భర్త బ్యాంకు ఖాతాకు గెలల సొమ్ము రూ.4కోట్లు, గెలల రవాణా రూపంలో సుమారు రూ.12లక్షలను ఆయిల్‌ఫెడ్ చెల్లించింది. టన్ను గెలల రవాణా ఛార్జీ 15కి.మీ.లోపు రూ.370, 15-30 కిలోమీటర్లు ఉంటే రూ.460 చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో గరిష్ఠ దిగుబడి 14టన్నులకు మించదని సమాచారం.

**దంపతుల పేరిట మోసం**

సత్తుపల్లి మండలం పాకలగూడెం వద్ద భర్త పేరిట పదెకరాలు, భార్య పేరిట ఆరెకరాల ఆయిల్‌పాం తోట ఉంది. వీరిద్దరికీ దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమ నుంచి ఫార్మర్ కోడ్ (ఎఫ్‌కోడ్)లు జారీ అయ్యాయి. ఈఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు పామాయిల్ పరిశ్రమకు 2,225 టన్నుల గెలలను ఆయన పంపించారు. అతడి భార్య పేరిట 300 టన్నుల గెలలను ఈఏడాది జులై 27, 28 తేదీల్లో, సెప్టెంబరు 3 నుంచి 10వరకు పరిశ్రమకు తరలించారు. దీనిపై కొంతమంది రైతులు ఫిర్యాదు చేసే వరకు అధికారులు మేల్కొలేదు. ఆరాతీస్తే దంపతులిద్దరూ తెలంగాణలోని సత్యనారాయణపురం, పాకలగూడెం, ఏపీలోని రాఘవాపురం, చింతంపల్లి, పట్టాయిగూడెం, గురుబట్లగూడెం, లింగగూడెం గ్రామాల్లోని కొంతమంది నుంచి గెలలు కొని అప్పారావుపేటకు తరలించారు. టీజీ ఆయిల్‌ఫెడ్ అనుమతి లేకుండా ఏకంగా కొనుగోలు కేంద్రాన్నే



ఏర్పాటుచేశారంటే అక్రమార్కులు ఎంతగా బరితెగించారో అర్థమవుతోంది. సమీప తోటల నుంచి ఎన్ని టన్నుల గెలలు రావొచ్చు? రవాణా స్థితి, ఎంతమంది రైతులు ఉన్నారో ఆయిల్‌ఫెడ్ సర్వే నిర్వహించి పూర్తిస్థాయి ఒప్పందాలతో దరఖాస్తు సమర్పించిన వ్యక్తికి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తుంది. ఆ కేంద్రానికి ఎఫ్‌కోడ్ కేటాయిస్తుంది. అక్రమంగా గెలలు కొన్న వ్యక్తులు తమ ఎఫ్‌కోడ్‌ల నుంచే అప్పారావుపేట పరిశ్రమకు గెలలను తరలించారు.

**హోల్డ్‌లో రూ.40 లక్షలు..!** పరిశ్రమలకు తరలించిన వారికి చెల్లించాల్సిన సొమ్మును టీజీ ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులు హోల్డ్‌లో పెట్టారు. ఆ సొమ్మును తీయాలంటే తప్పనిసరిగా ఆయిల్‌ఫెడ్ అనుమతి కావాలి. ఇప్పటికే చెల్లించిన సొమ్ము మాటేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. 'ఇద్దరు రైతులు పాకలగూడెం వద్ద గెలలు కొని పరిశ్రమకు తరలించారు. వారికి ఇప్పటికే రూ.4కోట్లు చెల్లించాం. అనుమతి లేకుండా కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి గెలలు సేకరిస్తున్నట్టు తెలియగానే ఎఫ్‌కోడ్‌లను నిలిపేశాం. వారికి చెల్లించాల్సిన రూ.40లక్షలను హోల్డ్‌లో ఉంచాం. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపనున్నారు' అని అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమ మేనేజర్ కల్యాణ్‌కు తెలిపారు.

# కడుపు కోత.. తీరని వెత

నల్గొండ : ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తున్నా అవగాహన కల్పించే వారు కరవయ్యారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగి అమ్మాయి పుడితే రూ.13వేలు, అబ్బాయి అయితే రూ.12వేల నగదుతో పాటు ఎంసీహెచ్ కిట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం నగదు పథకం నిలిచిపోయింది. కిట్లు కూడా అందడం లేదు. దీంతో ఎక్కువ శాతం మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇలా వెళ్తున్నవారిలో 85 శాతం వరకు శస్త్రచికిత్సలే జరుగుతున్నాయి. ప్రభుత్వాసుపత్రులకు ప్రసవాల కోసం వస్తున్న బాధితులను కొందరు కింది స్థాయి ఉద్యోగులు కమీషన్లకు కక్కుర్తి పడి ప్రైవేటుకు పంపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కరిని ప్రైవేటులో చేర్పితే రూ.3-5 వేల వరకు కమీషన్ పొందుతున్నట్లు సమాచారం. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే బాధితులకు ముందుగానే రూ.50వేల నుంచి 60వేల వరకు ప్యాకేజీలు మాట్లాడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌వో, నల్గొండ**

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం. ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. వైద్యాధికారులతో పాటు సిబ్బందికి ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు చేస్తున్నాం. ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసి సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతున్నాం. ఎక్కువ మొత్తంలో నగదు వసూలు చేస్తే పీసీపీఎన్‌డీటీ ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# పోషకాహారమే మహాభాగ్యం..!

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్నవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. చిన్నారుల నుంచి గర్భిణుల వరకు పోషక లోపాలతో సతమతమవుతున్నారు. వీరిలో కొంతమంది మంచాలకే పరిమితమవుతుంటే, మరికొందరు మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా బుధవారం (ఈనెల 17) నుంచి అక్టోబర్ 16 వరకు చిన్నారులు, మహిళల్లో పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించేందుకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. తక్కువ ఖర్చుతో స్వయంగా పోషక విలువలను పెంపొందించే విధానాలను విస్తృతపరచుకోవాలని సూచించనుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాలు నిర్వహించనుంది.

యంత్రాంగం చేపట్టనున్న కార్యకలాపాలు

చిన్నారులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యనందించేందుకు కసరత్తు చేస్తుంది.

జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గిస్తూ పంచదార, ఉప్పు, నూనె వాడకాన్ని ఎలా పరిమితం చేయాలనే అంశాలపై అవగాహన కల్పిస్తుంది.

శిశువు, చిన్నారుల్లో సక్రమమైన ఆహార అలవాట్లు అలవడేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

పోషకాహార మిషన్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాలను విశదీకరిస్తుంది. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహించి ఆత్మ నిర్భరతను పెంపొందించనుంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే కార్యక్రమాలు చేపడుతుంది.

# సహకారంలో అక్రమం.. విచారణలో జాప్యం




సిరిసిల్ల : 'కంచె చేను మేసిన చందంగా' మారింది చందుర్తి, ఇల్లంతకుంట ప్రాథమిక సహకార సంఘా (ప్యాక్స్)ల పరిస్థితి. పొంతన లేని లెక్కలు.. ఆడిట్లో చిక్కులు కనిపిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి** ఇల్లంతకుంట ప్యాక్స్ పరిధిలోని 19 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు ఏడు సీజన్లలో ధాన్యం కొనుగోళ్లు జరిగాయి. 2024 యాసంగి నుంచి ఈ కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించారు. గన్ని సంచులు, దారం (సుతిలి), సిబ్బంది నియామకం వరకు చేతివాటం ప్రదర్శించారు. ఏడు సీజన్లలో గన్నీ సంచులలోనే రూ.95 లక్షల మేరకు పక్కదారి పట్టినట్లు పౌరసరఫరాల శాఖ గుర్తించింది. ఒక్కో కేంద్రం నిర్వహణకు ముగ్గురు, నలుగురు నిర్వాహకులను ఏర్పాటు చేసినట్లు లెక్కలు చూపారు కానీ.. పనిచేసింది మాత్రం ఒక్కరే. ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున చెల్లించినట్లు లెక్కల్లో రాశారు. 19 కేంద్రాలకు 57 మందికి సంబంధించిన వేతనాలు రూ.3.90 లక్షలను స్వాహా చేశారు.

చందుర్తి ప్యాక్స్ పరిధిలో ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీలో రుణాలు లేని రైతుల పేర్లు బహిర్గతమయ్యాయి. ఈ వ్యవహారంలో రూ.కోటి నిధులు ప్యాక్స్ సిబ్బంది ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. ఆ ప్యాక్స్ సెక్రెటరీ నుంచి రూ.32 లక్షలను రికవరీ చేశారు. మిగతావి ఎవరి ఖాతాలో ఎంత? అనేది ఇప్పటికీ స్పష్టత లేదు.

ఇల్లంతకుంట ప్యాక్స్‌లో 2021 యాసంగిలో 8.37 లక్షల గన్నీ సంచులను పౌరసరఫరాలశాఖ సరఫరా చేసింది. వాటిలో 7.97 లక్షలను మాత్రమే వినియోగించారు. 39 వేల గన్నీ సంచులు మిగిలాయి. 2022 వానాకాలంలో 15 వేల గన్నీ సంచులు లెక్కలో ఉన్నాయి. వీటిని రైస్‌మిల్లులు, ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. ఇలా ఏడు సీజన్లకు సంబంధించిన మిగులు గన్నీలను పౌరసరఫరాలశాఖకు అప్పగించకుండా నిర్వాహకులు బయటవారికి విక్రయిస్తూ.. ప్యాక్స్‌లో మాత్రం పూర్తిగా వినియోగించినట్లు లెక్కలు చూపారు.

చందుర్తి ప్యాక్స్‌లోనూ 2022, 2023, 2024 సంవత్సరాలకు సంబంధించిన మిగులు గన్నీ సంచులు (కొత్తవాటిని) రైస్ మిల్లులకు విక్రయించినట్లు ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో డైరెక్టర్లు గుర్తించారు. దీనిపై ప్యాక్స్ సిబ్బందిని ప్రశ్నించిన డైరెక్టర్లు వేలం పాటలో విక్రయించినట్లు బుకాయించారు. వాస్తవానికి మిగిలిన గన్నీలను పౌరసరఫరాలశాఖకు అప్పగించాలి. మిగిలిన గన్నీలను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి సీజన్‌లో వేలాది రూపాయలను సొంతానికి వాడుకున్నారు. ఇల్లంతకుంట ప్యాక్స్‌లో జరిగిన అవకతవకలపై మాజీ డైరెక్టర్ ఆరు నెలల క్రితం డీసీవోకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ విచారణ ముందుకు సాగడం లేదు.

# అక్కడికక్కడే.. అందినకాడికి దోచుడే!



కొత్తగూడెం : పంటచేల నిండా విరగబూసిన తెల్లబంగారంతో ఈఏడాది రైతుల మోహాలు వెలిగిపోయాయి. కానీ ఆ ఆనందం ఆవిరయ్యేందుకు ఎక్కువ రోజులు పట్టలేదు. ఇటీవల కురిసిన వర్షాలు, సీసీఐ కొనుగోలు కేంద్రాల కొర్రీలు వారి పాలిట శాపంలా తయారయ్యాయి. తేమశాతం 12 దాటితే వెనక్కి పంపుతామనే సీసీఐ కేంద్రాల నిర్వాహకుల మాటలు అన్నదాతల గుండెలపై పిడిగుద్దుల్లా తగులుతున్నాయి. దిక్కుతోచని స్థితిలో కర్షకులు క్వింటా పత్తిని రూ.4-5వేలకే దళారులకు తెగనమ్ముకుంటున్నారు. సుజాతనగర్‌లోని ఓ ప్రైవేట్ మార్కెట్‌లో వ్యాపారులు అందినకాడికి దోచుకుంటున్నారు. రైతులు తీసుకొచ్చిన పత్తికి అనేక వంకలు పెడుతూ.. తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. అదే పత్తిని అదే మార్కెట్‌లో దళారులకు ఎక్కువ ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటుండటం గమనార్హం.

నా పేరు మంగ. మాది జూలూరుపాడు మండలం లైన్‌తండా గ్రామం. 12 ఎకరాల్లో పత్తి సాగుచేశాం. మొదటిసారి 30క్వింటాళ్ల పత్తి చేతికొచ్చింది. దాన్ని సీసీఐ కేంద్రంలో అమ్మటానికి తెచ్చాం. తేమశాతం 14 కంటే ఎక్కువ ఉండటంతో సీసీఐ అధికారులు తీసుకోవటానికి నిరాకరిస్తున్నారు. తిరిగి వెనక్కి వెళ్తే ట్రాక్టర్ అద్దె, కూలీల ఖర్చులు అన్నీ వృథా అవుతాయి. ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బిక్యా. ఈయనది జూలూరుపాడు మండలం మాసింపేట గ్రామం. పదెకరాల్లో పత్తి సాగుచేశారు. తాను పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాల్సిందిపోయి ప్రైవేట్ పత్తి మార్కెట్‌లో కూలీగా మారారు. పంట చేతికందే దశలోనే అకాల వర్షాలు కురవగా.. సీసీఐ కొర్రీలు, అందినకాడికి దోచుకుంటున్న దళారులతో చేనులోని పత్తిని తీయటానికి వెనుకాడుతున్నట్లు ఆయన తెలిపారు.

**పత్తి రైతుల డిమాండ్లు ఇవీ..**

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తి కొనుగోళ్లలో తేమశాతం నిబంధనను 15శాతానికి సడలించాలి.

తేమ కాస్త అధికంగా ఉన్నా.. నాణ్యతను బట్టి కొంత ధర తగ్గించైనా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కొనుగోలు చేస్తున్న యంత్రాల మాదిరిగానే పత్తిని ఆరబెట్టేందుకు ప్రభుత్వమే సౌకర్యాలు కల్పించాలి.

సీసీఐ నిబంధనల ప్రకారం 12శాతం కంటే తక్కువ తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తాం. రైతులు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందే తేమశాతాన్ని పరిశీలించాలి. అవసరమైతే స్థానిక వ్యవసాయ అధికారుల ద్వారా పంట నాణ్యతను తెలుసుకోవాలి. వర్షానికి తడిసినా, రంగు మారినా సీసీఐ కొనుగోలు చేయదు.

– కులకర్ణి, సీసీఐ కొనుగోలు కేంద్రం అధికారి, సుజాతనగర్

# మడిలో సాగుబడి

అశ్వారావుపేట : విద్యార్థి దశలోనే రైతుల అవతారం ఎత్తి సొంతంగా పంటలు సాగు చేస్తున్నారు అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు. భావి వ్యవసాయ శాస్త్రవేత్తలుగా, అధికారులుగా అన్నదాతల పంటల సాగుకు కీలకమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు శిక్షణ పొందుతున్నారు. విత్తడం నుంచి మార్కెటింగ్ వరకు అన్నీ తామై సాగులో మమేకమవుతున్నారు. ప్రయోగాత్మక శిక్షణ(ఏఈఎల్‌పీ)లో భాగంగా ఒక్కో బృందంలో ఎనిమిది మంది సభ్యులుగా ఆరు బృందాలుగా పలు రకాల పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. పత్తి, మిరప, కూరగాయలు, పూలతోటల సాగుతోపాటు, పుట్టగొడుగుల పెంపకం, వానపాముల ఎరువు తయారీ వంటివి చేస్తున్నారు. ఆదాయాన్ని కళాశాల అభివృద్ధికి వినియోగిస్తున్నారు.

**అధిక సాంద్రత పద్ధతిలో...**

– సాయి నిఖిత, విద్యార్థిని

కళాశాలకు చెందిన ఐదెకరాల్లో పత్తి అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేశాం. సాధారణంగా ఎకరానికి 6 వేల నుంచి 8 వేల మొక్కలు ఉంటాయి. అధిక సాంద్రత పద్ధతిలో 22 వేల నుంచి 25 వేలు వేశాం. సాధారణ పద్ధతిలో ఎకరానికి పది క్వింటాళ్ల లోపు దిగుబడి రాగా మాకు ఎకరానికి 15 నుంచి 17 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పెట్టుబడీ తగ్గుతుంది.

**సాగులో సమస్యలు అవగతం: ప్రసాద్, విద్యార్థి**

తక్కువ పెట్టుబడులతో వానపాముల ఎరువు, పుట్టగొడుగుల పెంపకం చేపట్టాం. మేము తయారు చేసిన ఎరువు స్థానిక రైతులు కొనుగోలు చేస్తున్నారు. పుట్టగొడుగులు స్థానికంగానే హోటళ్లకు విక్రయిస్తున్నాం. పంటల సాగులో ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి, వాటిని ఎలా



ఎదుర్కోవాలో తెలుసుకునేందుకు ఏఈఎల్‌పీ సహాయపడింది.

**సేంద్రియ పద్ధతిలో మిరప సాగు: రోహితా భాను, విద్యార్థిని**

ముప్పావు ఎకరంలో మిరప సాగు చేశాం. మల్చింగ్, డ్రిప్ ఏర్పాటు చేయడంతో కలుపు నివారణతోపాటు నీటి తడులు తక్కువ తీసుకుంటోంది. విద్యార్థులు తయారు చేసిన వానపాముల ఎరువుతోపాటు, వేప, గోమూత్రం కషాయాలను వినియోగిస్తున్నాం. పెట్టుబడి రూ.20 వేల వరకు అయింది. మా హాస్టళ్లలో వినియోగించుకోవడంతోపాటు అశ్వారావుపేట, సత్తుపల్లి మార్కెట్‌లో పచ్చి మిరప క్వింటా విక్రయించాం. మరో ఎనిమిది క్వింటాళ్లపైనే దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం.

# అరుస్తా.. అడ్డొస్తే కరుస్తా

సిరిసిల్ల : జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ మనుషులు కనపడితే చాలు దాడికి పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. వీధి కుక్కల బెడద నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వీటి సమస్య రోజురోజుకు పెరిగిపోతోంది.

**ఒకేరోజు 50 మందికిపైగా బాధితులు**

సిరిసిల్ల పట్టణంలో గత నెల 18 ఓ వీధి కుక్క రోడ్లపై కనిపించిన వారందరిపై దాడి చేయడంతో 50 మందికిపైగా బాధితులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి వరుస కట్టారు. ఒకేరోజు ఇంతమందిపై దాడి జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై సిరిసిల్ల పురపాలిక కమిషనర్ ఖాదిర్ పాషాతో మాట్లాడగా పట్టణంలో కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి వాటి సంతతి నియంత్రణపై దృష్టి పెడతామని, ఏబీసీ కేంద్రం అందుబాటులోకి



తీసుకొస్తామని చెప్పారు.

**నిరుపయోగంగా ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్**

సిరిసిల్ల పట్టణ శివారులో వీధి కుక్కల నియంత్రణ కోసం రూ.20 లక్షలు వెచ్చించి ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలతో వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించి వాటి సంతతి పెరగకుండా శస్త్రచికిత్స చేసి మూడు రోజులు అక్కడే ఉంచుకొని తిరిగి తీసుకొచ్చిన చోట వదిలిపెట్టేవారు. సిబ్బంది లేకపోవడం, పట్టించుకునేవారు లేకపోవడంతో ఆ కేంద్రం నిరుపయోగంగా మారింది. మరోవైపు శునకాల సంతతి పెరిగి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

# కలల కొలువు వరించె!

జగిత్యాల : వారంతా పేద, మధ్యతరగతికి చెందినవారు. వారి ఉద్యోగ కలలు జగిత్యాలలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా సాకారమయ్యాయి. శిక్షణ పొందినవారిలో 62 మంది ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికయ్యారు.

**ఈ శాఖలలో..**

ఇక్కడ శిక్షణ పొందినవారిలో ఇప్పటివరకు 62 మంది కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాలు సాధించారు. విద్యాశాఖలో 27, పోలీసు 15.. న్యాయ, స్టాఫ్ సెలక్షన్ కమిటీలో 4 చొప్పున, పురపాలక 3, బీమా రంగంలో 2, రెవెన్యూ, అటవీ, నీటి పారుదల, జెన్‌కో, ఆరోగ్య, రైల్వే, పంచాయతీరాజ్‌శాఖలో ఒక్కొక్కరు కొలువు తెచ్చుకున్నారు.

**ఐదు నెలలపాటు ఉచితంగా..**

2022లో జగిత్యాలలో ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రారంభమైంది. ఎస్సీలకు 75 శాతం, బీసీలకు 15, ఎస్టీలకు 10 శాతం సీట్లు కేటాయించారు. ప్రవేశపరీక్ష ద్వారా తొలి ఏడాది 90 మందికి ప్రవేశం కల్పించారు. అనంతరం మరో మూడు బ్యాచుల్లో వందమంది చొప్పున ఎంపికచేసి.. 5 నెలలపాటు ఉచిత భోజన, వసతితోపాటు విశేష అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇప్పించారు. ఉచిత స్టడీ మెటీరియల్‌తోపాటు నోటు పుస్తకాలు సహా యువతులకు రూ.150, యువకులకు రూ.100 చొప్పున కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించారు. వారాంతపు పరీక్షలు సహా సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు సిద్ధమయ్యేందుకు లైబ్రరీ వసతి కల్పించారు.

**అనుభవజ్ఞులైన వారితో..**

మాది జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట. నేను వరంగల్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందా. అనుభవజ్ఞులైన అధ్యాపకుల శిక్షణ, వారాంతపు పరీక్షలు, గ్రంథాలయం, కంప్యూటర్ లైబ్రరీ ఉపయోగపడ్డాయి. ఈ కేంద్రంలో మరింత మందికి శిక్షణ ఇస్తే బాగుంటుంది.

రమ్య, ఏఈ, నీటిపారుదలశాఖ



**ఆధునికీకరిస్తాం**

జగిత్యాల ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా 62 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జిల్లాకు గర్వకారణం. దీన్ని ఆధునికీకరించి నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఏర్పాట్లుచేస్తాం. సొంత భవన నిర్మాణానికి కృషి చేస్తాం. మరింత మంది ఉద్యోగాలు పొందేలా చూస్తాం.

లక్ష్మణ్‌కుమార్, సంక్షేమశాఖ మంత్రి

**నాలుగు బృందాలకు శిక్షణ పూర్తి**

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటివరకు నాలుగు బృందాలకు శిక్షణ ఇచ్చాం. 62 మంది ఉద్యోగాలు సాధించారు. కొత్త బృంద శిక్షణకు ప్రభుత్వానికి నివేదించాం. పేదలు ఉద్యోగాలు సాధించేందుకు ఈ స్టడీ సర్కిల్ ఉపయుక్తంగా ఉంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉంది. రాజ్‌కుమార్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి

## నీటి'బొట్టు'... జల'సిరి'కి పట్టు

నేరేడుచర్ల : బొట్టు బొట్టుగా వచ్చే నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తే తాగు, సాగునీటి ఇక్కట్లు చాలావరకు తీరతాయి. వర్షాకాలంలో చాలా వరకు భూగర్భ జలం ఆశాజనకంగానే ఉంటున్నా.. ఆ తరువాత అడుగంటి ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని 23 మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి జలసంరక్షణ, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐదురకాల ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇళ్లలో వ్యక్తిగత, పాఠశాలల్లో సామాజిక ఇంకుడు గుంతలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్‌వెల్ రీఛార్జి, భవనాలపై నుంచి వచ్చే వాననీటి సంరక్షణ చర్యలు, గ్రామాల్లో మురుగు నీటిని సురక్షితంగా భూమిలో



ఇంకించేలా నిర్మాణాలు చేపట్టారు.

**నిధుల కేటాయింపు ఇలా...**

వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6,500, సామాజిక రూ.14,073, బోర్‌వెల్ రీఛార్జి రూ.36,000, రూఫ్‌టాప్‌రెయిన్ వాటర్ సంరక్షణ రూ.39,000, డ్రెయిన్ చివర ఇంకుడు గుంతకు రూ.94,000 చెల్లించనున్నారు.

**చురుగ్గా సాగుతున్నాయి..**

డి.సోమసుందర్‌రెడ్డి, ఎంపీడీవో, నేరేడుచర్ల

వివిధ ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటి నిర్మాణం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయి. మురుగు నీరు భూమిలో ఇంకడం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు చాలావరకు తొలగే అవకాశం ఉంది.

## ఉపాధి.. కొక్కొరోకో

రాజపేట: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా సాగాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తోంది. వారుచేసే పనితో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తోంది. పెరటికోళ్ల పెంపకం ప్రోత్సహిస్తోంది. తాజాగా జిల్లాలో ఒక్కో గ్రామైక్య సంఘంలో ముగ్గురు సభ్యులకు రూ.2 వేల రుణం కింద కోడి పిల్లల పంపిణీ కార్యక్రమం త్వరలో ప్రారంభించనుంది. ఒక్కొక్కరికి ఒక యూనిట్ కింద 20 కోడి పిల్లలు అందించనున్నారు. వీరు ప్రతి నెలా రూ.200 వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. వివరాలు క్లుప్తంగా..

**ప్రస్తుతం సభ్యుల గుర్తింపు ప్రక్రియ** కోళ్ల పెంపకందారులు గుడ్లతో కోడి పిల్లల పునరుత్పత్తి చేస్తే వారి నుంచి కోడి పిల్లలను కొనుగోలు చేసి ఇతర సభ్యులకు పంపిణీ చేసే అవకాశం ఉండనుంది. గతంలో జిల్లాలో కొన్ని మదర్ యూనిట్లు ఏర్పాటైనట్లుగా తెలుస్తోంది. నిరంతరం ఆదాయ వనరుగా మారే అవకాశం ఉండనుంది. ప్రస్తుతం జిల్లాలోని ఒక్కో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మూడు యూనిట్లు అందించే యోచనలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లుగా సమాచారం. అయితే ప్రస్తుతం గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నట్లుగా డీపీఎం సీహెచ్.రవీందర్ 'న్యూస్‌టుడే'తో వెల్లడించారు.

**యూనిట్లు మంజూరు ఇలా..**

భువనగిరి, ఆలేరు, బొమ్మలరామారం,చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజపేట మండలాలకు 150 యూనిట్ల చొప్పున, అడ్డగూడూరు, ఆత్మకూర్(ఎం), బీబీనగర్, తుర్కపల్లి, మోటకొండూరు, రామన్నపేట, వలిగొండ మండలాలకు వంద, యాదగిరిగుట్ట, గుండాల 50 యూనిట్లు మంజూరయ్యాయి.

**పంపిణీ వివరాలు..**

ప్రస్తుతం మంజూరైనవి: 1850

ఒక్కో యూనిట్‌లో కోడిపిల్లలు : 20

యూనిట్‌కు అందించే రుణం: రూ.2వేలు

చెల్లించాల్సిన నెలవారీ కిస్తు : రూ.200

**అదనపు ఆదాయ వనరుగా..**

నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళల ఆదాయ అభివృద్ధికి దేశీయ కోడి పిల్లల పెంపకం దోహదపడుతుంది. ముఖ్యంగా పెరటికోళ్లతో పాటు పెరటి తోటలు, కూరగాయల సాగు, పాడి పరిశ్రమ వంటి యూనిట్లను మహిళా సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

## రెండుచోట్ల తాగునీరు కలుషితం..


ఖమ్మం : జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి, నీటి వనరులన్నీ పూర్తిగా నిండాయి. రహదారుల పక్కన వరద నీరు నిలుస్తోంది. ఈ క్రమంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతోంది. గ్రామీణ తాగునీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఖమ్మం, మధిర, సత్తుపల్లి తాగునీటి ప్రయోగశాలల్లో నీటి నమూనాలు పరీక్షించి ఫలితాలు తెలుసుకుంటున్నారు.

2025 జూన్ నుంచి సెప్టెంబరు 16 వరకు 2,729 తాగునీటి నమూనాలు పరీక్షించారు. 88 నమూనాల్లో అధిక మోతాదులో రసాయన పదార్థాలు గుర్తించారు. మరో 556 నమూనాలు సేకరించి బ్యాక్టీరియలాజికల్ పరీ క్షలు జరపగా ఎనిమిది నమూనాల్లో పాజిటివ్ ఉన్నట్లు తేల్చారు.

**సమస్య ఎక్కడ?**

ఖమ్మం రూరల్ మండలం కస్నాతండా, ఆరెకోడు గ్రామ పంచాయతీల పరిధిలోని బోర్లు, బావులు, ట్యాంకుల నుంచి ఈనెల 5, 6 తేదీల్లో సేకరించిన నీటి నమూనాల్లో బ్యాక్టీరియా, అధిక రసాయన పదార్థాలున్నట్టు తేలింది. వీటిని ప్రజలు తాగొద్దని పంచాయతీ కార్యదర్శులకు లేఖ ద్వారా తెలిపారు. వారం రోజులుగా బావులు, ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. కస్నాతండాలోని బావిలో నీటిని తోడేసి క్లోరినేషన్ చేయించారు. బోర్లు, ట్యాంకు లను శుభ్రపరుస్తున్నారు. జిల్లాలోని మూడు ప్రయోగశాలల్లో నిరంతరం తాగునీటి పరీక్షలు చేస్తున్నాం. ఎక్కడైనా తేడా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే క్లోరినేషన్ చేయిస్తున్నాం. భగీరథ పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీరు సరఫరా అవుతున్నా కొన్నిచోట్ల పరీక్షిస్తున్నాం.పుష్పలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఖమ్మం

## ప్రచారానికి రావొద్దు.. నోరెత్తొద్దు



హైదరాబాద్ : కొంతమంది నిరుద్యోగ జేఏసీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. వారి పక్షాన ఒక అభ్యర్థితో నామినేషన్ వేయించిన విషయం తెలిసిందే. వీరి ప్రచారాన్ని ఓ పార్టీ అడ్డుకుంది. పరస్పరం కేసులు నమోదు అయ్యాయి. ఓ యువకుడిని దారుణంగా కొట్టారు. దీనిపై నిరుద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా.. పోలీసులు ఇరుపక్షాలపై కేసు నమోదు చేయడం విశేషం. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. స్వతంత్రుల ప్రచారం చూసి ప్రధాన పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో పోటీచేసే హక్కు.. ప్రతి ఒక్కరికీ ఉన్నా.. బయటి వాళ్లు వచ్చి ప్రచారం చేస్తున్నారంటూ దౌర్జన్యానికి పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. అసలు స్వతంత్రుల ప్రభావం ఎంత అనే చర్చకు తెరలేపింది. ఉప ఎన్నికలో మొత్తం 58 మంది పోటీలో ఉన్నారు. ఇది నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఓ సరికొత్త రికార్డు.

**55 మందిలో కీలకం ఎవరు..**

రంగంలో ఉన్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు మినహా మిగిలిన 55 మందిలో.. కొంతమందితో ప్రధాన పార్టీల వారే నామినేషన్లు వేయించినట్లు తెలిసింది. ఏజెంట్ల పాసులు.. సారూప్య చిహ్నాలతో ఓటర్లను తికమక చేయడం కోసం నామినేషన్లు వేయించినట్లు సమాచారం. మరికొందరు ప్రభుత్వ విధానాలను ఎండగట్టేందుకు ఈ ఎన్నికను వేదికగా వినియోగించుకుంటున్నారు. వారిలో నిరుద్యోగ జేఏసీ, ఆర్ఆర్ఆర్, ఫార్మాసిటీ నిర్వాసితులు తదితరులు ఉన్నారు. 2023 ఎన్నికల్లో స్వతంత్రులకు వచ్చిన ఓట్లు 5వేల లోపే.

**షరతులు విధిస్తూ..**ప్రభావం చూపే స్వతంత్రుల మద్దతు కోసం ప్రధాన పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. వారిని పోటీ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటనలు చేయాలని, లేదా ప్రచారానికి రాకుండా మౌనంగా ఉండాలని షరతులు విధిస్తున్నాయి. మరోవైపు కొంతమంది ప్రధాన పార్టీల నుంచి డబ్బు వసూలుకు నామినేషన్లను దాఖలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బతుకులు 'తారు'మారు



హైదరాబాద్ : నగరంలో గుంతలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. విపత్తులతో సమానంగా నష్టం మిగుల్చుతున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం.. ఆర్థిక, సామాజిక, పర్యావరణం పరంగా హైదరాబాద్ ఏడాదికి రూ.10వేల కోట్లు నష్టపోతోంది. ఎంతో మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు కూడళ్లలోనూ గోతులు ఏర్పడి ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. వాతావరణ, ధ్వని కాలుష్యం పెరుగుతోంది.

**గోయ్యి తీసి పాతేస్తున్నట్లుగా..**

గుంత పొడవు 2.5మీటర్లు, వెడల్పు 1.33మీటర్లు, లోతు 0.3మీటర్లు అనుకుంటే.. దాని విస్తీర్ణం క్యూబిక్ మీటరు. అలాంటి గుంతను పూడ్చేందుకు జీహెచ్ఎంసీ రూ.12,500 బిల్లు చెల్లిస్తుంది.

గుంతలో 140డిగ్రీల వేడితో ఉన్న తారు మిశ్రమంతో నింపాలి. దాన్ని గట్టిపరిచేందుకు రోలర్ తిప్పాలి.

రోడ్డు పొడవున, రెండు వైపులా 'సాసర్ డ్రెయిన్' నిర్మించాలి. కురిసిన ప్రతి చినుకూ ఎక్కడికక్కడ అంచులకు చేరి, సాసర్ డ్రెయిన్ ద్వారా దిగువకు వెళ్లాలి. రోడ్డుపై ప్రవహిస్తే నాణ్యత దెబ్బతిని గుంతలు ఏర్పడతాయి.నగరంలో తారు మిశ్రమం తయారు చేసే కేంద్రాలు రెండే ఉన్నాయి. అవి కూడా ఓపెన్ ఎయిర్ కేంద్రాలు. వర్షం వస్తే తారు మిశ్రమం తయారీ నిలిచిపోతుంది. ఇంజినీర్లు చల్లని తారుతో గుంతలు పూడ్చుతున్నారు. సహాయ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించట్లేదు.

**అపార నష్టాలు..**

ఒక్క గుంత పూడ్చడానికి బల్దియా చేసే ఖర్చు రూ.12,500

వర్షాకాలంలో ఏర్పడ్డ గుంతలు (అధికారికంగా) 20 వేలు

పూడ్చివేత ఖర్చు రూ.25 కోట్లు

గతేడాదిలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ ఖర్చు రూ.500 కోట్లు

నగరంలో తిరిగే వాహనాలు 60 లక్షలు

దెబ్బతిన్న వాహనాల మరమ్మతుల ఖర్చు రూ.50 కోట్లు

ట్రాఫిక్ సమస్యలతో అదనంగా ఖర్చయ్యే ఇంధనం రూ.100 కోట్లు


బాధితుల వైద్య ఖర్చు రూ.50 కోట్లు

ఐటీ, సరకు రవాణా నష్టం రూ.2 వేల కోట్లు

**రహదారులను తిరిగి నిర్మించాలి**

నగరాభివృద్ధిలో రోడ్ల పాత్ర ప్రధానమైనది. సర్కారు ఆ విషయంలో శ్రద్ధ చూపట్లేదు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవాలి. నగరంలోని రోడ్ల కిందనున్న పొరలు బూడిదలా మారాయి. ఒక్కో రోడ్డును పూర్తిగా తవ్వేసి తారు, రసాయనాలు, కంకరతో తయారైన మిశ్రమాన్ని పునాదిగా మార్చాలి. సమాంతరంగా పైపులైన్లు, భూగర్భ మురుగునీరు, వరదనీటి వ్యవస్థను పటిష్ఠం చేయాలి. పైన నాణ్యమైన తారు మిశ్రమంతో రోడ్లను నిర్మించాలి.ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణుడు

## ఆధార్ పీవీసీ.. భద్రతలో మేటి




రాయికల్ : భారత విశిష్ట గుర్తింపు సంస్థ(యూఐడీఏఐ) జారీ చేసే ఆధార్ కార్డు ఇప్పుడు పీవీసీ రూపంలోనూ అందుబాటులో ఉంది. నామమాత్రం రుసుముతో లభించే దీన్ని అధికారిక వెబ్‌సైట్ లేదా ఎంఆధార్ యాప్ ద్వారా సులభంగా పొందవచ్చు.

**లాగిన్ విధానం**

మొదట అధికారిక వెబ్‌సైట్ %https:///myaadhaar.uidai.gov.in%/ / హోమ్‌పేజీలో మై ఆధార్ విభాగంపై క్లిక్ చేసి ఆధార్ నంబర్, ఓటీపీతో లాగిన్ కావాలి. అనంతరం 'ఆర్డర్ పీవీసీ కార్డు' ఐచ్ఛికం ఎంచుకొని రూ.50 చెల్లిస్తే (యూపీఐ యాప్స్, నెట్ బ్యాంకింగ్, డెబిట్/ క్రెడిట్) 10-15 రోజుల్లో పోస్టు ద్వారా ఆధార్‌లోని చిరునామాకు రిజిస్టర్డ్ పోస్టులో వస్తుంది.

**చరవాణికి అనుసంధానం కాకుంటే**

%https:///myaadhaar.uidai.gov.in%// అధికారిక వెబ్‌సైట్ హోమ్‌పేజీలో 'మై ఆధార్' విభాగం కింద ఉన్న ఆర్డర్ ఆధార్ పీవీసీ కార్డు ఐచ్ఛికాన్ని ఎంచుకోవాలి.

12 అంకెల ఆధార్ సంఖ్య లేదా 28 అంకెల ఎన్‌రోల్‌మెంట్ ఐడీ/ సర్వీస్ ఐడీని ఎంటర్ చేసి, సెక్యూరిటీ కోడ్/క్యాప్చా కోడ్ నమోదు చేయాలి.

'మై మొబైల్ నంబర్ నాట్ రిజిస్టర్డ్' ఐచ్ఛికం ఎంచుకొని ఇతర ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేసి, ఓటీపీని నమోదు చేయాలి. టర్మ్స్ అండ్ కండీషన్స్ అంగీకరించి 'సబ్మిట్' ఎంచుకొని రూ.50 చెల్లిస్తే పోస్టు ద్వారా ఆధార్‌లోని చిరునామాకు వస్తుంది.

యాప్ ద్వారా..యాప్‌లో ఆధార్ నంబర్‌తో లాగిన్ అనంతరం 'ఆర్డర్ పీవీసీ కార్డు' ఎంచుకొని టర్మ్స్ అండ్ కండీషన్స్ అంగీకరించి సబ్‌మిట్ చేయాలి. 12 అంకెల ఆధార్ సంఖ్య లేదా 28 అంకెల ఎన్‌రోల్‌మెంట్ ఐడీ/సర్వీస్ ఐడీని ఎంటర్ చేసి సెక్యూరిటీ కోడ్/క్యాప్చా కోడ్ నమోదు చేయాలి. అనంతరం మొబైల్ నంబర్(రిజిస్టర్డ్ లేదా అన్‌రిజిస్టర్డ్) నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. నమోదు చేసిన అనంతరం మేక్ పేమెంట్‌ను ఎంచుకొని రూ.50 చెల్లిస్తే ఆధార్‌లోని చిరునామాకు వస్తుంది. ఈ మూడు విధానాల్లో చెల్లింపు విజయవంతమైన అనంతరం ఎస్ఆర్ఎన్(సర్వీస్ రిక్వెస్ట్ నంబర్)తో కూడిన రసీదు వస్తుంది. దాన్ని కార్డు డెలివరీ స్థితిని ట్రాక్ చేయడానికి ఉపయోగించవచ్చు.

**ఇవీ ప్రయోజనాలు**

ఆధార్ పీవీసీ పేపర్ కార్డు కంటే ఎక్కువ కాలం మన్నుతుంది. నీరు, దుమ్ము వల్ల పాడవదు. మడతలు పడదు. ఏటీఎం కార్డు పరిమాణంలో ఉండటంతో పర్సులో పెట్టుకునే వీలుంటుంది. దీనిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఫొటో, డేటా, సెక్యూర్ ఎలిమెంట్స్ కనిపిస్తాయి. బ్యాంకులు, విమానాశ్రయం, ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తింపు కార్డులా వినియోగించవచ్చు. హోలోగ్రామ్, ఘోస్ట్ ఇమేజ్, మైక్రో టెక్స్ట్ వంటి భద్రతా అంశాలున్నాయి.

## తేమ తగ్గితే బంగారమే..!

సూర్యాపేట : ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.82 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంది. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 78.31 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేసేందుకు 41 జిన్నింగు మిల్లులను ఎంపిక చేశారు. నుంచి తెల్ల బంగారం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులే సీసీఐకి విక్రయించాలి. యాప్ గురించి పత్తి రైతులకు రైతువేదికల్లో ఏఈవోలు అవగాహన కల్పిస్తున్నారు.

తేమను బట్టి ధర: 8శాతం కాకుండా 9, 10, 11, 12శాతం తేమ ఉంటే సీసీఐ నిర్ణయించిన పింజ రకాలు, పొడవునుబట్టి ధర తగ్గుతూ వస్తుంది.పింజపొడవు (గింజ నుంచి పత్తిని వేరు చేసినప్పుడు వచ్చే



దూది పొడవు)

మైక్రోనీర్ (గింజ నుంచి లాగినప్పుడు కనిపించే పత్తి సాంద్రత)

ప్రభుత్వం పత్తి కొనుగోలు సంబంధిత సేవలను పొందడానికి టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. సందేహాలున్న రైతులు 1800 599 5779 నెంబరుకు ఫోన్ చేసి పరిష్కరించుకోవచ్చు. జిల్లాలో 9 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. తిప్పర్తి మండలం రామలింగాలగూడెం సత్యనారాయణ కాటన్ ఇండస్ట్రీ, చండూరు బాలాజీ కాటన్ ఇండస్ట్రీ, చిట్యాల వరలక్ష్మి కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్-ఏ శ్రీలక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీ, మాల్-బి శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-ఏ శివ కాటన్ ఇండస్ట్రీ, మల్లేపల్లి-బి తిరుమల కాటన్ జిన్నింగ్ ప్రాసెసింగ్ మిల్, నకిరేకల్ శ్రీనాథ్ కాటన్ ఫైబర్, శాలిగౌరారం టీఆర్ఆర్ కాటన్ మిల్లుల్లో పత్తి కొనుగోలు జరుపుతారు.

**నాణ్యమైన సరకుకే 'మద్దతు'**

ఈ ఏడాది పత్తికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.8,110 ప్రకటించింది. ఈ ధరను దక్కించుకోవాలంటే రైతులు నిబంధనలకు లోబడి సరకు తీసుకురావాలి. తేమశాతం 8 నుంచి 12 మధ్య ఉంటేనే కొనుగోలు చేస్తారు. ఆపైన ఉంటే తిరస్కరిస్తారు. ఇప్పటికే వర్షాలతో నష్టాలు ఎదుర్కొని, అధిక పెట్టుబడి పెట్టిన పత్తి రైతులు దళారులను ఆశ్రయించకుండా నిబంధనల ప్రకారం తేమ ఉండేలా చూసుకుని స్లాట్ బుకింగ్ చేసుకుని విక్రయించాలి. అప్పుడే కోరుకున్న మద్దతు ధర దక్కుతుంది.

## పోషకాల డబ్బా.. అదిరిందబ్బా

మిర్యాలగూడ : నాలుగైదు రకాల పండ్ల ముక్కలు, గుప్పెడు ఉడికించిన శనగలు, నాలుగు జీడి పప్పులు, ఖర్జూర, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటివి ఉదయం, సాయంత్రం వేళలో తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నిత్యం వాటిని సమకూర్చుకోవడం అందరికీ కుదరకపోవచ్చు. అయితే ఇటీవల పలువురు యువత పండ్ల ముక్కల డబ్బాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఆరోగ్యం.. యువతకు ఉపాధి లభిస్తున్నాయి. గతంలో నగరాలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడిప్పుడే నల్గొండ, మిర్యాలగూడ వంటి పట్టణాలకు సైతం విస్తరిస్తుంది.

డబ్బాల్లో దానిమ్మ, జామ, యాపిల్, పైనాపిల్, బొప్పాయి, పుచ్చ వంటి పండ్ల ముక్కలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, కీర దోస ముక్కలు, రాజ్మా, శనగలు వంటి ఉడికించిన గింజలు, పెసర్లు, అలసందలు వంటి మొలకెత్తిన గింజలు, ఖర్జూర, జీడిపప్పు, బాదంపప్పు, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు.

**సామాజిక మాధ్యమాల్లో ప్రచారం**

పండ్ల ముక్కల డబ్బాల గురించి సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాలు, వాట్సప్ గ్రూపులతో పాటు.. ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ట్విటర్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగిస్తున్నారు. కొందరు పండ్లను కడగడం నుంచి కోయడం, ప్యాకింగ్ చేయడం వంటి అన్ని పనులను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు.

**బాక్సులు ఇలా..**ప్రస్తుతం జిల్లాలో లభిస్తున్న బాక్సుల్లో నాలుగు రకాల పండ్ల ముక్కలు, రెండు రకాల కూరగాయల ముక్కలు, ఒక రకం మొలకలు కలిపి రూ.2వేలకు విక్రయిస్తుండగా.. కపుల్ బాక్సును రూ.3,500కు విక్రయిస్తున్నారు. వీటితో పాటు మరో మూడు రకాల డ్రైఫ్రూట్స్ కూడా కలిపి గోల్డ్ బాక్స్ పేరుతో రూ.2,400, దీంట్లోనే కపుల్ బాక్స్‌ను రూ.4వేలకు విక్రయిస్తున్నారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్, సాయంత్రం డిన్నర్ లాగా సరఫరా చేస్తుండగా..ఎక్కువ మంది ఉదయమే వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

**20తో మొదలు...**

నేను తొలుత ఈ ఏడాది జనవరిలో ఫ్రెష్ బైట్స్ ఫ్రూట్ బాక్స్ పేరిట పండ్ల ముక్కల పంపిణీని ప్రారంభించాను. అంతకు ముందు నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం వల్ల తొలి రోజు 20 బాక్సుల ఆర్డర్‌తో మొదలు పెట్టాను. మధ్యలో వందకు పైగా చేరినప్పటికీ..ప్రస్తుతం 85 వరకు అందిస్తున్నాం.పగిళ్ల కల్యాణ్, మిర్యాలగూడ

## ప్లాస్టిక్ ముప్పు.. ఎవరిదీ తప్పు..!

నల్గొండ : పురపాలికల్లో పాలిథిన్ నిషేధం ప్రచారానికే పరిమితం అయింది. అటవీ, పర్యావరణ పరిరక్షణ చట్టం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ఉత్తర్వుల ప్రకారం 50 మైక్రాన్లు మందం కంటే తక్కువ ఉన్న పాలిథిన్ సంచులను వాడకూడదు. తెలుపు రంగు తప్ప నలుపు, నీలం, ఇతర రంగులను వాడేందుకు వీలు లేదు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పురపాలికల్లో కమిషనర్లు పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే నిల్వలను సీజ్ చేయాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టిక్‌ను తగ్గించాలని చెబుతున్నా ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో పాలిథిన్ వస్తువుల వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికలు, మండల కేంద్రాల్లో నిర్దిష్ట ప్రమాణాలు లేని ప్లాస్టిక్ నిషేధం కథ మొదటికొచ్చింది. 19 పురపాలిక పరిధిలో నిత్యం 320 టన్నులకు పైగా వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అందులో 30 శాతానికి పైగా పాలిథిన్ సంచులు, గ్లాసులు, బాటిల్స్ పోగవుతున్నాయి. గత ఏడాది నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ పట్టణాల్లో పాలిథిన్ సంచులు వాడే దుకాణాలను సీజ్ చేసి రూ.3 లక్షలకు పైగా జరిమానా విధించారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నియంత్రణ కరవైంది. తనిఖీలు, జరిమానా విధించే అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సూర్యాపేట, నల్గొండ పురపాలికల్లో నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. మిగతా 17 చోట్ల తనిఖీల జోలికి అధికారులు వెళ్లడం లేదు. హైదరాబాద్, విజయవాడ కేంద్రాల నుంచి ప్రధాన పట్టణాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు వ్యాపారులు సరఫరా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు.అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం

పాలిథిన్ నిషేధం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. వ్యాపారులుపై ఇటీవల రూ.50వేలకు పైగా జరిమానాలు విధించి వసూలు చేశాం. మరిన్ని దాడులు చేస్తూ పాలిథిన్ వాడకం, విక్రయాలపై నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

# కిన్నెరసానికి మొసళ్ల బెడద!

పాల్వంచ : మొసళ్ల సంచారంతో కిన్నెరసాని కాల్వ ప్రమాద కరంగా మారింది. గత వారం వ్యవధిలో నాలుగు మొసళ్లు సంచరించి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేశాయి. కరకవాగు సమీపంలో ఓ మొసలి ఒడ్డుకు రావడంతో కుక్కలు చూసి అరిశాయి. స్థానికులు పరిశీలించగా మొసలి కనిపించింది. మనుషులను గమనించిన మొసలి కాల్వలోకి జారుకుంది. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి గమనించినప్పటికీ అది కనిపించలేదు. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం, నీటిరంగు మారడంతో మొసలిని పట్టుకునే అవకాశం లేదని అటవీశాఖ అధికారులు తెలిపారు.

**కాల్వల్లో సంచారంతో బెంబేలు..**

కిన్నెరసానికి వరద ఉద్ధృతి ఎక్కువగా ఉండటంతో కేటీపీఎస్ అధికారులు గేట్లు ఎత్తారు. ఆ గేట్ల నుంచి మొసళ్లు బయటకు వస్తున్నాయి. కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం అనంతరం డ్యాంకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 1974లో అధికారులు 32 మొసళ్లను వదిలారు. ప్రస్తుతం అవి వందల సంఖ్యకు చేరాయి. గేట్లు ఎత్తుతున్న నేపథ్యంలో బయటకు వస్తున్నాయి. కొన్ని మొసళ్లు నీటిలో కొట్టుకెళ్లి గోదావరిలో కలుస్తుండగా మరికొన్ని ఒడ్డుకు చేరి ఇళ్లల్లోకి వస్తున్నాయి.



ఇటీవల పూసలతండా సమీపంలో ఓ మొసలి నీటిలో కనిపించిందని స్థానికులు భయాందోళన వ్యక్తం చెందుతున్నారు. ఇటీవల ఓ మొసలి కిన్నెరసాని పాఠశాలల సమీపంలో కనిపించింది. కేటీపీఎస్ కాల్వల్లో పెద్ద మొసలి, చిన్న పిల్లలు సైతం తిరుగుతున్నాయి. కేటీపీఎస్ కాల్వ పక్కనున్న కరకవాగు, పూసలతండా తదితర గ్రామాల ప్రజలు కాల్వ నీటిలోనే దుస్తులు శుభ్రం చేసుకుంటారు. కొందరు పిల్లలు ఆ కాల్వలోనే ఈత కొడతారు. రైతులు కాల్వ పక్కనే ఉన్న పొలాల్లో పనులు చేసుకుంటారు. మొసళ్ల సంచారంతో అందరూ భయాందోళనకు గురవుతున్నారు. ఇదేకాక కిన్నెరసాని గురుకుల పాఠశాలల పిల్లలు సైతం బహిర్భూమికి ఆ కాల్వ వద్దకే వెళ్తారు. అధికారులు స్పందించి మొసళ్లను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే భవిష్యత్తులో ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఈ అంశంపై అటవీశాఖ అధికారులు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. నీటి ప్రవాహం ఎక్కువ ఉండటంతో మొసళ్లు కనిపించట్లేదని తెలిపారు. ఒడ్డున కనిపిస్తే వాటిని బెదరకొట్టకుండా తక్షణం సమాచారమిస్తే వచ్చి పట్టుకుంటామన్నారు.


# పరిశోధన మెరుగైతేనే పంట వైవిధ్యం

జగిత్యాల : యాసంగి.. వానాకాలం.. సీజన్ ఏదైనా వరి సాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. కూలీల కొరత, మార్కెటింగ్ ఇబ్బందులు, కోతులు, అడవిపందుల బెడద వంటి కారణాలతో ఆరుతడి పంటలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఏటికేడు వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ పంటల వైవిధ్యం కనుమరుగవుతోంది. ఈ నెల ఆరంభం నుంచి యాసంగి సీజన్ ప్రారంభమైన దృష్ట్యా ఈసారైనా ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం నుంచి పరిశోధనపరమైన ప్రోత్సాహం పెరగాల్సిన అవసరం ఉంది.

**ఉమ్మడి జిల్లా అవసరాలివీ..**

జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, నువ్వులపై ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. వేరుశనగ, పత్తి, కంది, చెరకు తదితర ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపడితే ఇక్కడి నేలలకు అనువైన వంగడాల రూపకల్పన సాధ్యమవుతుంది. ఇటీవలి కాలంలో జగిత్యాల జిల్లాలో ఆవాల సాగు గణనీయంగా పెరిగినందున పొలాస పరిశోధన స్థానంలో ఐసీఏఆర్ ఆధ్వర్యంలో ఆవాల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో పూర్తి స్థాయి పత్తి పరిశోధనలను అందుబాటులోకి తేవాలి. శనగ, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆముదం, పెసర, మినుము తదితర పంటల్లో మేలైన వంగడాలను అందుబాటులోకి తెస్తే నల్లరేగడి నేలలున్న పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో ఏరువాక కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కూనారం వరి పరిశోధన స్థానంలో ఆరుతడి పంటలపై పరిశోధనలు చేపట్టాలి. కరీంనగర్‌లో కేవలం మొక్కజొన్నపైనే పరిశోధనలు సాగుతుండగా స్థానిక నేలలకు అనువైన పంటలపై చేయాల్సి ఉంది. జగిత్యాల సమీపంలోని చల్‌గల్ వాలంతరీ ప్రదర్శన క్షేత్రంలో ఉద్యాన పరిశోధన స్థానాన్ని ఏర్పాటు చేస్తే మామిడి, పసుపు, ఉల్లి, అల్లం, కూరగాయలు, పసుపు, మిరప, సీతాఫలం, జామ, బత్తాయి, బొప్పాయి, అల్లం, కర్బూజా, సపోటా, అరటి తదితర పండ్లు, పూల



సాగు చేపట్టే రైతులకు మేలైన వంగడాలు అందుబాటులోకి వస్తాయి. యాసంగిలో జొన్న, సజ్జ, నువ్వులు, ఆవాలు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతున్నందున ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలు రైతులతో ధర నిర్ణయం, ముందస్తు ఒప్పందం చేసుకొనేలా చర్యలు తీసుకోవాలి. ముత్యంపేట చెరకు కర్మాగారాన్ని తెరిస్తే చెరకు సాగు గణనీయంగా పెరుగుతుంది. పాలీహౌస్‌ల రాయితీని పునరుద్ధరించాలి. పంటల బీమాను యాసంగి నుంచి అమలు చేయాలి.

**పంట మార్పిడితో లాభాలు**

వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుతో దిగుబడి, నేల స్థితిగతులు మెరుగుపడతాయి. నేలలో పోషకాలు, నీటి లభ్యత, కూలీల అందుబాటు, వన్యప్రాణుల బెడద, మార్కెటింగ్ వసతి చూసుకొని రైతులు పంట మార్పిడి పాటించాలి.

డా.ఎస్.హరీష్ కుమార్‌శర్మ, ఏడీఆర్, పొలాస పరిశోధన స్థానం

# కోస్తున్నారు.. ఆరబోస్తున్నారు..!



నల్గొండ: వానాకాలం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబోస్తున్నారు. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలంలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి బుధవారం ప్రారంభించారు. దొడ్డు ధాన్యం క్వింటాల్‌కు మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, బీ గ్రేడ్ రకానికి 2,369 చెల్లించనున్నారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మరోవారం రోజుల్లో కేంద్రాలు ప్రారంభం కానున్నాయి.

సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయకుంటే మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్ లాంటి ప్రాంతాల్లో రైతులు మిల్లర్లను ఆశ్రయించి పెట్టుబడి ఖర్చుల కోసం నిలువు దోపిడికైనా సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో దొడ్డురకం- 14 లక్షలు, సన్నరకం-10 లక్షలు.. రెండు కలిపి మొత్తం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇందులో ప్రభుత్వం తెరిచే కొనుగోలు కేంద్రాలకు 13.60 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం తీసుకువచ్చే అవకాశాలున్నాయని పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

**పెట్టుబడి ఖర్చుల కోసం అమ్ముతున్నాను**

**గుగులోతు రాములు, సూర్యాపేట**

నేను పది ఎకరాలలో వరిసాగు చేస్తే వంద బస్తాల ధాన్యం తిరుమలగిరి మార్కెట్‌కు తెచ్చాను. వర్షాకాలం పంట రక్షించుకునే పరిస్థితులు లేవు. అక్టోబరు 1 నుంచే గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని అనుకున్నా.. కానీ, చేయలేదు. దీంతో చేతికొచ్చిన పంటను అమ్మడానికి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ఎంత ధర వచ్చినా అమ్మిపోతాను. మిగిలిన పంట నూర్పిడికి, పెట్టుబడి ఖర్చులకు డబ్బులు అవసరం ఉన్నాయి.

**కొర్రీలు విధించకుండా కొనుగోలు చేయాలి**

**తండు కొండయ్య, గంగన్నపాలెం, తిప్పర్తి, నల్గొండ**

కేంద్రాల్లో అధికారులు కొర్రీలు విధించకుండా మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలి. ఎన్నిసార్లు శుభ్రం చేసినా తేమ,తాలు పేరిట బస్తాకు గతంలో గరిష్ఠంగా కిలోన్నర ధాన్యం వరకు కోతలు పెట్టారు. ఈసారి కొర్రీల కిరికిరి పెట్టకుండా వెంటనే కొనుగోలు చేయాలి. నాకున్న పదకొండు ఎకరాల్లో దొడ్డువి ఐదెకరాలు, మిగిలిన ఆరు ఎకరాల్లో సన్నధాన్యం సాగు చేశా. దొడ్డుధాన్యం కోతల అనంతరం 180 క్వింటాళ్ల మేర వస్తే వాటిని ఈ యార్డుకు తీసుకువచ్చా.

# గని ఆలస్యం.. ఉపాధి సంక్షోభం




ఇల్లెందు : కార్మికులు, వారి కుటుంబాలతో కళకళలాడే సింగరేణికి పుట్టినిల్లైన ఇల్లెందు (బొగ్గుట్ట) నేడు వెలవెలబోతోంది. గనులు అంతరించిపోవడంతో ఇక్కడి ప్రజలకు ఉపాధి లేక నగరాలకు వలసపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న ఒక్క జేకే-5 ఉపరితల గనిలో బొగ్గు నిల్వలు అడుగంటడంతో గనిపై ఆధారపడిన వేల మంది ఉపాధి కోల్పోయారు. సెప్టెంబర్ నాటికే నూతన జేకే కోల్‌మైన్ ప్రారంభిస్తామని యాజమాన్యం ప్రకటించినా.. ఇప్పటికీ ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో సింగరేణి శాశ్వత ఉద్యోగులతో పాటు, ఒప్పంద, రోజువారీ కార్మికులు, ఇతర వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**గని ఏర్పాటైతేనే బొగ్గుట్టకు భవిష్యత్తు..**

ఇల్లెందులో గతంలో పదుల సంఖ్యలో భూగర్భ గనులు ఉండేవి. బొగ్గు తవ్వకాలు పూర్తి కావడంతో యజమాన్యం ఆ గనులను దశల వారీగా మూసేసింది. అనంతరం 2012లో జేకే-5 ఉపరితల గని ప్రారంభించింది. ప్రస్తుతం ఆ గనిలో బొగ్గు నిల్వలు అడుగంటాయి. అక్కడ ఉన్న కార్మికులను బదిలీ చేసి యంత్రాలను ఇతర ఏరియాలకు తరలించారు. కార్మిక వర్గం తీవ్ర సంక్షోభంలో ఉంది. నూతన గని ఏర్పాటయ్యే వరకు ఇక్కడే ఉంటామనుకున్న శాశ్వత కార్మికులు గని మూతడటంతో సందిగ్ధంలోకి వెళ్లారు. ఉపాధి కోల్పోయిన ఒప్పంద కార్మికులు కూలీలు మారారు. వలస వెళ్లి పనులు చేసుకుంటున్నారు.

నూతన జేకే కోల్‌మైన్ గని ఏర్పాటైతేనే ఇల్లెందు భవిష్యత్తుకు మనుగడ ఉంటుంది. గని ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు వచ్చినా యాజమాన్యం ప్రారంభించకపోవడంపై కార్మిక సంఘాలు, ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్యాకేజీలపై కొరవడిన స్పష్టత**

నూతన గని ఏర్పాటు చేసే విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్ పంచాయతీల్లో సింగరేణి, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి సుమారు 164 మంది నిర్వాసితులను గుర్తించారు. కానీ వారికి చెల్లించే ప్యాకేజీలు, నష్టపరిహారాలపై స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదు. కొందరు రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. తమకు తగిన నష్టపరిహారం చెల్లిస్తేనే గని ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఖాళీ చేస్తామని చెబుతున్నారు. ఈ పరిస్థితులను గమనిస్తే గని ఏర్పాటుకు ఇంకా కొన్ని నెలలు పట్టే అవకాశం లేకపోలేదని తెలుస్తుంది.

గని ఏర్పాటుకు గతంలో అటవీ, పర్యావరణ శాఖల నుంచి అన్ని రకాల అనుమతులు ఇచ్చారు. ఇంకా ఓ భాగంలో 17.50 హెక్టార్లకు అటవీశాఖ అనుమతి రావాల్సి ఉంది. పార్ట్-1, పార్ట్-2 అనుమతులు వచ్చాక గని ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం. వీసం కృష్ణయ్య, సింగరేణి ఏరియా జీఎం

# 'గెల'గలలా.. విలవిలలా!

అశ్వారావుపేట : ఆయిల్ ఫెడ్ ముందస్తు ప్రణాళిక లోపంతో వచ్చే ఏడాది మొక్కలకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. రాష్ట్రంలో 3 లక్షల పైచిలుకు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సగం తోటలు విస్తరించాయి. అగ్రభాగం భద్రాద్రి జిల్లాది. అందులోనూ అశ్వారావుపేట నియోజకవర్గం ముందు వరుసలో ఉంది. ఈ ఏడాది అత్యధికంగా అశ్వారావుపేటలో తోటల విస్తీర్ణం పెరగగా అంతేస్థాయిలో దమ్మపేట, ములకలపల్లి మండలాలున్నాయి. అశ్వారావుపేట కేంద్రీయ నర్సరీలో మొక్కలు నిండుకున్నాయి. రెండు నెలలుగా సిద్ధిపేట, జనగాం, తొర్రూరు, మహబూబాబాద్, రంగనాయకసాగర్ నర్సరీల నుంచి తెప్పిస్తున్నారు. వచ్చే ఏడాది మరో లక్ష ఎకరాల్లో తోటలు విస్తరించాలని ఉద్యానశాఖ భావిస్తోంది. రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో 17 లక్షల మొక్కలు అందుబాటులో ఉండగా, మరో 5 లక్షలు ప్రైవేటు కంపెనీల నర్సరీల్లో ఉన్నాయి. అవి చాలా వరకు ఏపీలోని రాయలసీమ జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలోని నర్సరీల్లో సుమారు 10 లక్షల మొక్కలు 40 నెలల పైబడి ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలినవి 2024లో విత్తినవి ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 17 లక్షల మొక్కలతో 29,825 ఎకరాల్లో తోటలు వేయొచ్చు. సిద్దిపేట, జనగాం నుంచి వచ్చినవి వచ్చినట్లే రైతులకు సరఫరా చేస్తున్నారు.

**ఆర్వోఎఫ్ఆర్ భూముల్లో పెరిగిన డిమాండ్**

అటవీ హక్కుల పత్రాలు పొందిన పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు డిమాండు పెరిగింది. వీటిలో ఇందిర సౌరగిరి జల వికాస్ ఆధ్వర్యంలో బోర్లు, విద్యుత్తు మోటార్లు, విద్యుత్తు సౌకర్యం లేనిచోట సోలార్ విద్యుత్తుతో ఆయిల్‌పామ్ సాగు జోరందుకుంది. ఇప్పటికే పోడు భూముల్లో బోర్లు విస్తృతంగా వేశారు. వేలాది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టడంతో కొరత ఏర్పడింది. విత్తనాల కోసం



కోస్టారికా, మలేషియా లాంటి దేశాలకు ఇండెంట్ పెట్టలేదని తెలిసింది.

**15 లక్షల మొక్కలకు ఇండెంట్ పెడతాం**

**జంగా రాఘవరెడ్డి, ఛైర్మన్, సుధాకరరెడ్డి, జీఎం**

రాష్ట్రంలో వచ్చే ఏడాది మొక్కల కొరత ఏర్పడకూడదనే ఉద్దేశంతో 15 లక్షలకు విదేశాల నుంచి ఆర్డర్ పెట్టనున్నాం. పొట్టి రకాల మొక్కలకు పెట్టాలనుకోవడంతో కొంత ఆలస్యం అయింది. వచ్చే ఏడాది మొక్క అడిగిన ప్రతి రైతుకూ అందించేందుకు క్వారంటైన్ పరిశీలన అనంతరం ఆర్డర్ పెట్టనున్నాం. ముందుగా 15 లక్షలు, ఆ తరువాత మరో 10 లక్షల మొలకల కోసం ఆర్డర్ పెట్టనున్నాం.

# నామపత్రాలకు వేళాయె!

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కీలక ఘట్టానికి తెరలేసింది. నోటిఫికేషన్ వెలువడనుంది. అనంతరం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుంది. ఇందుకు షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి సాయిరాం వెల్లడించారు. సెలవు రోజులు మినహా మిగిలిన పనిదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. కార్యాలయంలో నేరుగా లేదా.. డిజిటల్ విధానంలో దాఖలు చేసే అవకాశం కల్పించారు. ఇదీ పరిస్థితి..!.. భారాసకు చెందిన జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య సునీత ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ బరిలో ఉన్నారు. భాజపా అభ్యర్థిని సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ప్రధాన పార్టీల నామినేషన్ తేదీలు ఇంకా ఖరారు కాలేదు.

**ఇవీ మార్గదర్శకాలు**

25 ఏళ్లు నిండిన పౌరులు నామినేషన్ వేయొచ్చు. నామినేషన్ పత్రం ఫారం 2బీ, అఫిడవిట్ ఫారం 26 ఇవ్వాలి. జాతీయ, రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల తరఫున పోటీ చేసే వారికి జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన ఒక పౌరుడు ప్రతిపాదించవచ్చు. ఇతర అభ్యర్థులకు పది మంది అవసరం. అభ్యర్థి స్వయంగా లేదా.. ప్రతిపాదకుల్లో ఒకరు వచ్చి దాఖలు చేయవచ్చు.

డిజిటల్ నామినేషన్‌ను %https://encore.eci.gov.in% ద్వారా దాఖలు చేయొచ్చు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న ప్రింటెడ్ హార్డు కాపీని అందజేయాలి. నియమాలు: నామినేషన్ దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలిపివేస్తారు. అదీ మూడు వాహనాలకే పరిమితం. అభ్యర్థి సహా అయిదుగురు వ్యక్తులను మాత్రమే ఆర్వో కార్యాలయం లోపలికి అనుమతిస్తారు. షేక్‌పేట తహసీల్దారు కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. నియోజకవర్గంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నోటిఫికేషన్, నామినేషన్‌ల స్వీకరణ నేటి నుంచి

చివరి తేదీ: 21

పరిశీలన: 22

ఉపసంహరణ గడువు: 24

ఎన్నికలు: నవంబరు 11

ఓట్ల లెక్కింపు: 14

# ముందుచూపు.. గాంధీకి కొత్త రూపు

హైదరాబాద్: గ్రామాల నుంచి వచ్చిన రోగులు గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రిలో అడుగుపెడితే అంతా అయోమయం.. ఎక్కడ ఏ విభాగం ఉంటుందో చెప్పేవారే ఉండరు. ఎక్కడా బోర్డులు కన్పించవు. సిబ్బందిని అడిగినా.. తమకు తెలియదనే సమాధానం వస్తుంటుంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ ఆసుపత్రులకు బ్రాండింగ్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత గాంధీ ఆసుపత్రిని తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కేరళలోని ప్రభుత్వ ఆసుపత్రులను అధికార బృందం పరిశీలించి అనుసరణీయ విధానాలు గుర్తించింది.

**ఇలా చేయనున్నారు...**

గాంధీ ఆసుపత్రికి నిత్యం అయిదారు వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి విభాగానికి దారిచూపేలా, రాత్రి సమయంలోనూ స్పష్టంగా కన్పించేలా బోర్డులు ఏర్పాటు చేస్తారు.

ఆసుపత్రి వాతావరణం చూస్తే కొందరు మానసిక ఆందోళనకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో బ్యూటిఫికేషన్ చేపట్టనున్నారు. పచ్చిక బయళ్లతోపాటు, కళాకృతులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దనున్నారు.

చదువు రానివారైనా సులువుగా చేరుకోవడానికి వీలుగా ప్రతి విభాగానికి ప్రత్యేక రంగు లైట్లను ఏర్పాటు చేస్తారు. ప్రధాన ప్రవేశ ద్వారం వద్దే వీటి గుర్తులు ఉంటాయి.

రోగులకు నాణ్యమైన సేవలందించేలా, వారు నిరీక్షించే ప్రాంతంలో కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యంతో పాటు శుభ్రమైన మరుగుదొడ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోనున్నారు. సేవల్లో నాణ్యత పెంచేలా శిక్షణ ఇవ్వనున్నారు. గంటల తరబడి క్యూలో నిరీక్షించకుండా.. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఓపీ చీటీ పొందేలా సాంకేతికతను వినియోగించనున్నారు. ఆరోగ్యశ్రీకి వెంటనే రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడనున్నారు. దివ్యాంగులకు ప్రత్యేక వీల్‌ఛైర్లు కేటాయించి, మరింత మంది పేషెంట్ కేర్ సిబ్బందిని నియమించనున్నారు.

ఆసుపత్రికి ఏటా 30 శాతం రోగులు పెరుగుతున్నా.. నర్సింగ్, పారామెడికల్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పెరగడం లేదు. విడతల వారీగా నియామకాలు చేపట్టనున్నారు.

# ఆదాయం పెంచేలా చెత్త సేకరణ

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ ఆదాయ మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్, అదనపు కట్టడాల మదింపు, వాణిజ్య సముదాయాలను గుర్తించి పన్ను మదించడం వంటి వైపు చర్యలు తీసుకుంటుండగా.. తాజాగా వాణిజ్య ప్రాంతాల్లో చెత్త సేకరణను ప్రైవేటుకు అప్పగించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీ మాదిరిగా దుకాణాల నుంచి చెత్తను తీసుకెళ్లడానికి ప్రైవేటు ఏజెన్సీకి టెండర్ ద్వారా అప్పగించారు. గతేడాది జరిగిన పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానం చేశారు.

**ఏటా రూ.60 లక్షల ఆదాయం**

నివాసిత ఇళ్ల నుంచి కొన్నేళ్లుగా చెత్త సేకరణకు నెలవారీ రుసుం వసూలు చేస్తుండగా.. అదే విధానాన్ని వాణిజ్య సంస్థలు, దుకాణాలకు వర్తింపజేయనున్నారు. వాణిజ్య సంస్థల ద్వారా వచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు టెండర్ నిర్వహించారు. తద్వారా ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం రానుంది.బల్దియాకు నాలుగు ట్రాక్టర్లు, 16 మంది కార్మికులు పని చేస్తుండగా ఏడాదికి రూ.40 లక్షల ఖర్చు అవుతుంది. ఆ మొత్తాన్ని యూజర్ ఛార్జీల చొప్పున వసూలు చేస్తుండగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చెత్తసేకరణను ప్రైవేటుగా అప్పగించేలా గతంలోనే వివరాలను సేకరించారు. ప్రస్తుతం వస్తున్న రూ.60 లక్షల ఆదాయానికే టెండర్ దక్కించుకున్నారు. కార్మికులు, నాలుగు ట్రాక్టర్ల సేవలను ఇతర డివిజన్ అవసరాలకు వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది.

**టవర్ సర్కిల్ నుంచే ప్రారంభం** టెండర్ దక్కించుకున్న సంస్థ మూడు రోజులుగా తమ వాహనానికి చెత్త ఇవ్వాలని, మూడు డబ్బాలు ఏర్పాటు చేసుకోవాలని, యూజర్ ఛార్జీలతో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ఆటో ద్వారా టవర్‌సర్కిల్ ప్రాంతంలో ప్రచారం చేస్తున్నారు. వచ్చే నెల 1 నుంచి పూర్తి స్థాయిలో అమలుకానుంది. ఆ తర్వాత నగరవ్యాప్తంగా కేటాయించిన ఏరియాల్లోంచి చెత్తను తరలిస్తారు. ప్రైవేటు సంస్థ ద్వారా చెత్తను సేకరించి యూజర్ ఛార్జీలు వసూలు చేయనున్నారు. చెత్త వేసినా, వేయకపోయినా దుకాణం నుంచి నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు.




అమరావతి: భారత మహిళా క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్.. క్యాంప్ కార్యాలయంలో ఏపీ సీఎం చంద్రబాబును కలిశారు. వీరికి మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. ప్రపంచకప్ గెలిచినందుకు శ్రీచరణిని చంద్రబాబు, నారా లోకేశ్ అభినందించారు. వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనంద క్షణాలను శ్రీచరణి వారితో పంచుకున్నారు. ప్రపంచకప్ గెలుచుకోవడం ద్వారా టీమ్‌ఇండియా జట్టు సత్తా చాటిందని.. మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం కొనియాడారు. అంతకుముందు గన్నవరం విమానాశ్రయంలో శ్రీచరణికి మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ ఛైర్మన్ రవినాయుడు ఘన స్వాగతం పలికారు.




విజయవాడ: వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం, మహిళా క్రికెటర్ శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది.

**ఇది మొదటి అడుగు మాత్రమే: శ్రీచరణి...** క్రికెటర్ శ్రీచరణి ఇవాళ ఉదయం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబం నుంచి నాకు చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడించేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే.. ముందు చాలా ఉంది. ప్రధాని మోదీని కలిసినప్పుడు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారు" అని అన్నారు.

## ఏపీఐఐసీ బోర్డు డైరెక్టర్లను నియమించిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)కు బోర్డు డైరెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి 15 మంది సభ్యులను బోర్డు డైరెక్టర్లుగా నియమించింది.

వీళ్లంతా రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు సంబంధిత కార్యాచరణ చేపట్టాలని ఏపీఐఐసీ ఎండీకి ఆదేశాలు జారీ చేస్తూ.. పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

## డిసెంబర్ 30 నుంచి తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం: తితిదే ఈవో



తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల విజ్ఞప్తి మేరకు అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీని డిప్ విధానం నుంచి మార్చినట్లు ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ కోటా విడుదల చేయనున్నట్లు చెప్పారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు కార్తిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్లు జారీ చేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు తితిదే బోర్డు ఒక కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.. "తిరుమలలో డిసెంబర్ 30 నుంచి 2026 జనవరి 8వ తేదీ వరకు శ్రీవారి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తాం. ఇందు కోసం ఆఫ్‌లైన్, ఆన్ లైన్ టోకెన్ల జారీ విధి విధానాలు త్వరలో తెలియజేస్తాం. రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాల్లో రూ.750 కోట్ల శ్రీవాణి ట్రస్టు నిధులతో 5 వేల భజన మందిరాలు నిర్మిస్తాం. తిరుమల అటవీ ప్రాంతంలో రానున్న 10 సంవత్సరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు తితిదే బోర్డు నిర్ణయించింది. తితిదే ఆలయాల్లోని ఆయా ప్రాంతాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లుగా అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రాకారము, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి పనులు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి" అని అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు.

## పరకామణి కేసులో దోషులు జైలుకెళ్లక తప్పదు: భానుప్రకాష్ రెడ్డి




విజయవాడ, నవంబరు7 : పరకామణి కేసుపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణి విషయంలో దోషులు జైలుకెళ్లక తప్పదని హెచ్చరించారు. దొంగను దాతగా చేశారని... దొంగతనాన్ని కానుకగా మార్చారని ఆరోపించారు. ఇప్పుడు కరుణాకర్ రెడ్డి అండ్ కో నీతిమంతుల్లాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇవాళ(శుక్రవారం) విజయవాడ వేదికగా మీడియాతో మాట్లాడారు భానుప్రకాష్ రెడ్డి. పరకామణి విషయంలో దొంగలను తీసుకెళ్లి లోకాయుక్తలో కరుణాకర్ రెడ్డి ఎలా రాజీ చేస్తారని ప్రశ్నించారు. శ్రీనివాసుడు ఉగ్ర నరసింహుడు అయ్యారని.. తన ఖజానాను దోచుకున్న కరుణాకర్ రెడ్డి అండ్ కోని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారని వార్నింగ్ ఇచ్చారు భానుప్రకాష్ రెడ్డి.

కరుణాకర్ రెడ్డి అండ్ కో పరకామణి కేసు విషయంలో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దమ్ముంటే కరుణాకర్ రెడ్డి అండ్ కో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఆరోజు పరకామణి విషయంలో తీర్మానాలు చేస్తూ సంతకాలు చేసింది కరుణాకర్ రెడ్డి కాదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. పరకామణి చాలా సున్నితమైన అంశమని.. భక్తులు కరుణాకర్ రెడ్డి చెప్పే అబద్ధాలని నమ్మొద్దని సూచించారు. వడ్డీకాసుల వాడు... వడ్డీతో సహా... కరుణాకర్ రెడ్డి అండ్ కోకు చెల్లించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని భానుప్రకాష్ రెడ్డి హెచ్చరించారు.

## ఉనికి కోల్పోతానన్న భయంతోనే అసత్యాలు.. జగన్‌పై మంత్రి సీరియస్

ప్రకాశం, నవంబర్ 7: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు రైతుల మీద ప్రత్యేకమైన ప్రేమ పుట్టుకొచ్చిందంటూ ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఏ ఒక్క రైతును కూడా పరామర్శించ లేదని గుర్తుచేశారు.

మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు పని చేశారని తెలిపారు. తుఫాను సమయంలో ప్రభుత్వం బాగా పని చేసిందని ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారనన్నారు. ఉనికి కోల్పోతానన్న భయంతో జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ప్రతిపక్ష నేత అర్హత కూడా జగన్ సంపాదించుకోలేక పోయారంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం పని చేయకపోతే జగన్ అసెంబ్లీకి వచ్చి చర్చించాలని అన్నారు. జగన్ ప్రభుత్వంలో ఏం చేశారో... కూటమి ప్రభుత్వం ఏం చేస్తుందో అసెంబ్లీలో చర్చిస్తే ప్రజలకు తెలుస్తుందని మంత్రి చెప్పుకొచ్చారు. జగన్ పార్టీలో గెలిచిన పది మంది ఎమ్మెల్యేలను ప్రజలు కూడా మర్చిపోయారని అన్నారు. కొత్త జిల్లాలు, కొత్త రెవిన్యూ డివిజన్‌లు ఏర్పాటుపై మంత్రి వర్గ ఉప సంఘం పని చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుంటారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.





## జగన్‌కు ఇచ్చి పడేసిన మంత్రి పార్థసారథి..

అమరావతి : వైఎస్ జగన్‌పై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ ప్రభుత్వ హయాంలో క్రెడిట్ చోరీ తప్ప ఆయన చేసిందేమీ లేదంటూ ఎద్దేవా చేశారు. ఆయన పాలనంతా దోపిడీ, విధ్వంసమే ధ్యేయంగా సాగిందన్నారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి పార్థసారథి.. జగన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. మొంథా తుపాను వేగం కంటే చంద్రబాబు ప్రభుత్వం వేగంగా స్పందించి.. క్షేత్ర స్థాయిలో యంత్రాంగాన్ని నడిపించిందన్నారు మంత్రి. కానీ, ఇవేవీ కనిపించని జగన్.. అబద్ధాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో జగన్ చేసిందంతా క్రెడిట్ చోరీనే అని విమర్శించారు. ప్రభుత్వంలోకి రావడమే ఆలస్యం.. విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడ్డాడని.. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు మంత్రి పార్థసారథి. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడానికి జగన్ చేసిన మోసాలు, విధ్వంసమే కారణమన్నారు. జగన్ ప్రభుత్వం హయాంలో అమ్మఒడి ద్వారా ప్రతి పిల్లవాడిని చదివిస్తానని చెప్పి.. ఇంటికి ఒకరికే ఇచ్చి మోసం చేశారన్నారు. కానీ, టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నట్లు మంత్రి చెప్పారు. 67 లక్షల మంది విద్యార్థులకు ఇంటర్ వరకు రూ. 10,090 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారాయన. జగన్ ప్రభుత్వంలో చిక్కి, కోడిగుడ్ల పంపిణీలో రూ. 200 కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై వారు సిగ్గుపడాలన్నారు. రైతు భరోసా రూ. 14 వేలు ఇస్తామని చెప్పిన జగన్.. కేవలం రూ. 7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు రెండు విడతలుగా రైతులకు ఇస్తున్నామని చెప్పారు పార్థసారథి. ఇక పెట్టుబడులు రాబట్టే విషయంలోనూ కూటమి సర్కార్ అద్భుతంగా పని చేస్తోందన్నారు మంత్రి. ఇప్పటికే రూ. 7.68 లక్షల కోట్ల పెట్టబడులు గ్రౌండ్ అయ్యాయని చెప్పారు. 2027-28 నాటికి 7.20 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. జగన్ హాయంలో పెట్టుబడులు రాలేదన్న మంత్రి.. 'మీ క్రెడిట్ మాకు వద్దు.. మీరే జాగ్రత్తగా ఉంచుకోండి. కానీ, అబద్ధాలు మానండి' అంటూ హితవు చెప్పారు.





కర్నూలు: వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్‌ను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయన్ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు.. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి వీరంతా సజీవ దహనమయ్యారు. ఈ బస్సు రిజిస్ట్రేషన్ విషయంలోనూ లొసుగులున్నట్లు.. సీటర్ వాహనాన్ని స్లీపర్‌గా మార్చినట్లు ఆరోపణలున్నాయి. ప్రమాద ఘటనకు సంబంధించి బస్సు డ్రైవర్, యజమానిపై కేసు నమోదైంది. ఇప్పటికే ఏ-1 అయిన డ్రైవర్ లక్ష్మయ్యను పోలీసులు అరెస్టు చేశారు.




తమ వద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అణు నిరాయుధీకరణ గొప్ప విషయమని, ఈ అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధినేత జిన్‌పింగ్‌తో చర్చించినట్లు వెల్లడించారు. ఫ్లోరిడాలోని మయామిలో జరిగిన అమెరికన్ బిజినెస్ ఫోరమ్‌లో ఈ మేరకు మాట్లాడారు. "అణు నిరాయుధీకరణ అనేది గొప్ప విషయం. మా వద్ద ఉన్న అణ్వాయుధాలతో మేం ప్రపంచాన్ని 150 సార్లు పేల్చేయగలం. అయితే ఆ అవసరం లేదు. ప్రతిఒక్కరూ డబ్బును అణ్వాయుధాలపై కాకుండా ఇతర విషయాలు ముఖ్యంగా ప్రజలకు ప్రయోజనం కలిగించే వాటిపై ఖర్చు చేయాలని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉండాలని నేను కోరుకుంటున్నాను. దానిని సాధించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. ప్రజలకు తెలియని ఎన్నో యుద్ధాలు జరిగాయి. ప్రస్తుతం అవి లేవు" అని ట్రంప్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఇటీవల ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న అగ్ర రాజ్యాధినేత సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. "రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయుధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మావద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ, అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చించా" అని ట్రంప్ తెలిపారు. అయితే ఎక్కడ, ఎప్పుడు ఈ పరీక్షలు నిర్వహించనున్నారన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరందిస్తాం: మంత్రి నిమ్మల




పూర్తి కాని వెలిగొండ ప్రాజెక్టును.. జగన్ జాతికి అంకితం అంటూ ప్రకాశం జిల్లా ప్రజల్ని మోసం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఇటీవల మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. జంట సొరంగాల్లోకి చొచ్చుకువచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణం డిజైన్స్ అప్రూవల్ చేయాలన్నారు. ప్రాజెక్టు పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. "పూర్తి కాని వెలిగొండను పూర్తి చేశానని జగన్ అనడం ప్రపంచంలో ఎనిమిదో వింత. నిర్వాసితులకు రూ.900 కోట్లకు పైగా పరిహారం అందించాల్సి ఉండగా ఒక్క రూపాయి పంపిణీ చేయలేదు. ఆగిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు పునరుద్ధరించారు. టన్నెల్-2లో ఇంకా 4.2 కి.మీ లైనింగ్ పనులు, బెంచింగ్ పనులు చేయడంతో పాటు, టీబీఎం యంత్రం తొలగించాల్సి ఉంది. ఫీడర్ కెనాల్ లైనింగ్, 3 కి.మీ పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం ఇటీవలే రూ.456 కోట్లతో టెండర్లు పిలిచాం. ఈ నెలలోనే ఫీడర్ కెనాల్ పనులు మొదలుపెట్టబోతున్నాం. టన్నెల్-2లో టీబీఎం యంత్రం తొలగించడానికి సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు 2026లో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి, ఆయకట్టు రైతులకు నీరందించే లక్ష్యంతో పని చేస్తున్నాం" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

# అక్కడ కూడా ఇక్కడ లాగే అందలం!

ఢిల్లీ బ్యూటీ రాశీఖన్నా ప్రయాణం టాలీవుడ్, కోలీవుడ్ లో ఎలా సాగిందో చెప్పాల్సిన పనిలేదు. రాశీఖన్నాకి వచ్చినన్నీ అవకాశాలు మరే నటికి రాలేదు. జయాపజయాలతో సంబంధం లేకుండా అమ్మడు రెండు భాషల్లోనూ అవకాశాలు అందుకుంది.

మీడియం హీరోలకు పర్ఫెక్ట్ జోడీగా సెట్ అయింది. కానీ ఫలితాలు మాత్రం కను చూపుమేర ఎక్కడా కనిపించవు. అవకాశాలు అందుకున్నంత వేగంగా అమ్మడి ఖాతాలో విజయాలైతే నమోదు కాలేదు. ఈ విషయంలో రాశీఖన్నా ఎంతో లక్కీ. సాధారణంగా విజయాలు ఉంటే తప్ప అవకాశాలు రావు .

**అదృష్టం కలిసి రావడంతోనే బిజీగా:** కానీ రాశీకి విజయాలులేకపోయినా అవకాశాలు వచ్చాయి. టాలీవుడ్ లో వచ్చినంత కాలం అలాగే ఛాన్సులొచ్చాయి. ఇదే సన్నివేశాన్ని కోలీవుడ్ లో కూడా చూపించింది. ఇలా ఇన్ని అవకాశాలు ఎలా సాధ్యమంటే? ప్రతిభతో దక్కించుకుందా? అంటే అమ్మడు గొప్ప పెర్ఫార్మర్ కూడా



కాదు. ఎలాంటి పాత్ర అయినా ఒకేలా నటిస్తుందనే విమర్శ తొలి నుంచి ఉంది. అన్ని సినిమాల్లో నటించిన అనుభవం ఉన్నా? పాత్రలో ఎలాంటి వైవిధ్యత చూపించని ప్రదర్శన ఇస్తుంది. అయినా అవకాశాలు అందుకుందంటే ? కారణం లక్ అనే చెప్పాలి.

**బాలీవుడ్ లో బిజీ బిజీగా:** అయితే ఇదంతా రెండు..మూడేళ్ల క్రితం నాటి కథ. ప్రస్తుతం తెలుగు, తమిళ్ లో అమ్మడికి పెద్దగా అవకాశాలు రాలేదు. దీంతో ఈ గ్యాప్ లో బాలీవుడ్ లోనే ఎక్కువ సినిమాలు చేస్తోంది. అయితే అక్కడ కూడా ఇక్కడ లాగే అమ్మడిని అందలం ఎక్కిస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో ఓ రెండు..మూడు సినిమాలు చేస్తోంది. 120 'బహదూర్ ' , తాల్కన్ మెయిన్ ఏక్, బ్రిడ్జి చిత్రాల్లో నటిస్తోంది. ఆన్ సెట్స్ లో ఉన్న చిత్రాలివి. అన్ని పనులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది రిలీజ్ కానున్నాయి.

**రాశీఖన్నా లక్కీ గాళ్:** గత ఏడాది యోధ,ది సబర్మతి రిపోర్ట్ లాంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అవేవి సరిగ్గా ఆడలేదు. అయినా సరే అమ్మడికి హిందీలో అవకాశాలు క్యూ కడుతున్నాయి. లైనప్ లో ఉన్న సినిమాలతో పాటు, కొన్ని కొత్త కథలు కూడా విందని..వాటికి త్వరలోనే సైన్ చేస్తుందని సమాచారం. మొత్తానికి రాశీఖన్నాలా అవకాశాలు రావాలంటే పెట్టి పుట్టాలి. అప్పుడే విజయాలు లేకపోయినా? అవకాశాలు వస్తాయి.

# నేషనల్ క్రష్ తప్ప ఇంకెవ్వరూ పోటీలో లేరా!

సౌత్ లో ఎన్ని సినిమాలు చేసినా? అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలి అన్నది ప్రతీ హీరోయిన్ కల. ఈనేపథ్యంలో నటీమణులంతా బాలీవుడ్ అంటే ఆసక్తి చూపిస్తుంటారు. సౌత్ భామలు సైతం బాలీవుడ్ అవకాశాల కోసమే ఎదురు చూస్తారు. వచ్చాయంటే సౌత్ లో ఎంత బిజీగా ఉన్నా వాటిని వదిలేసి మరీ వెళ్లిపోతుంటారు. అక్కడ వచ్చే ఆదాయం మిగతా పరిశ్రమలకంటే అధికంగా ఉంటుంది. సెలబ్రిటీ లైఫ్ మరింత రిచ్ గా ఉంటుంది. బాలీవుడ్ అంటే పెద్ద ఇండస్ట్రీ కూడా. తక్కువ సమయంలోనే ఎక్కువ సంపాదించే అవకాశం బాలీవుడ్ లో ఉంటుంది.

**అవకాశాలు కష్టమేనా:** అందుకే దక్షిణాది పరిశ్రమలో ఎన్ని సినిమాలు చేసినా చాలా మంది హిందీకి వెళ్లలేకపోయామనే నిరుత్సాహన్ని వ్యక్తం చేస్తుంటారు. సమంత, కీర్తి సురేష్, రష్మికా మందన్నా ఇప్పటికే బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. శ్రీలీల కూడా హిందీకి ఎంట్రీ ఇచ్చింది. ఇంకా మరికొంత మంది భామలు ముంబై కి చేరుకున్నారు.



కానీ వీళ్లలో రష్మిక మదన్నా తప్ప ఇంకెవ్వరూ బాలీవుడ్ భామలతో పోటీ పడలేకపోతున్నారు? అన్నది వెలుగులోకి వచ్చింది. అవకాశాల కంటే ముందే మీడియా అటెన్షన్ డ్రా చేయడంలోనూ రష్మిక మినహా ఎవరూ కాంపిటీషన్ లో కనిపించలేదన్నది తాజా సమాచారం.

**ఎలివేషన్ ఏదీ వర్కౌట్ అవ్వలేదు:** ఉత్తరాది భామలతో పోలిస్తే దక్షిణాది భామలు గ్లామర్ ఎలివేషన్ పరంగా ఎంత మాత్రం పోటీ ఇవ్వలేక పోతున్నారు. అందులో సక్సెస్ అయిది రష్మిక మాత్రమేనని మిగతా వారంతా అక్కడ కల్చర్ కు అల వాటు పడలేకపోతున్నారు. సమంత రెండుళ్లగా బాలీవుడ్ లోనే ఎక్కువగా తిరుగుతోంది. సినిమాలు చేయకపోయినా? అమ్మడి ఫోకస్ అంతా అక్కడే ఉంది. వీలైనంత వరకూ ఎక్స్ పోజ్ అయ్యే ప్రయత్నం చేస్తుంది. కానీ సామ్ ఎలివేషన్ ఏది? వ్యక్తిగత హైప్ తీసుకు రావడం లేదు.

**రష్మిక మాత్రమేనా:** కీర్తి సురేష్ కూడా నిబంధనలు సడలించిందనే ప్రచారం తప్ప అక్కడ భామలకు ధీటుగా ముందుకెళ్ల లేకపోతుంది. ముంబై బ్యూటీ పూజా హెగ్డే పెట్టాల్సిన ఎఫెర్ట్ అంతా ఎప్పుడో పెట్టేసింది. కానీ ఆ బ్యూటీ కూడా కాంపిటీషన్ లో లేదు. తెలుగు అమ్మాయి శ్రీలీల కూడా అక్కడ కల్చర్ కు అలవాటు పడటం అంత సులభం కాదు. వీళ్లందరిలో ఉన్నంతలో రష్మిక బెటర్ గా కనిపిస్తుంది. బాలీవుడ్ నవతరం భామలకు మంచి పోటీగా నిలుస్తుంది. మీడియా అటెన్షన్ డ్రా చేయగల్గుతుంది. కొత్త అవకాశాలు అందుకో గల్గుతుంది. ఇదంతా ఎలా సాధ్యమైందంటే? పోటీని తట్టుకుని ముందుకెళ్లింది కాబట్టే అన్నది గ్రహించాలి.




# టాప్ - 10 భారీ బడ్జెట్ చిత్రాలివే ..







ఈ మధ్యకాలంలో ఒక సినిమా తెరకెక్కించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఎందుకంటే ఒకప్పుడు కోటి మించకుండానే సినిమాలు తీసి రెట్టింపు లాభాలను అందుకునేవారు నిర్మాతలు. కానీ ఇప్పుడు హై బడ్జెట్ సినిమాలు తీసినా కూడా ఆ సినిమాలు హిట్ అవుతాయా లేదా అని నిర్మాతలకు భయం పట్టుకుంది. అలా పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఒకరిని చూసి మరొకరు ఎక్కువ బడ్జెట్ పెట్టి సినిమాలు తీస్తూ.. బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడుతున్నారు. అయితే ఇప్పటివరకు మన ఇండియన్ సినిమాల్లో హైయ్యెస్ట్ బడ్జెట్ పెట్టిన సినిమాలు ఏమేమి ఉన్నాయి అనేది ఇప్పుడు చూద్దాం..

**కల్కి 2898 :**ఇప్పటివరకు వచ్చిన ఇండియన్ సినిమాల్లో హైయ్యెస్ట్ బడ్జెట్ పెట్టిన మొట్టమొదటి మూవీ కల్కి 2898 ఏడి.. వైజయంతి మూవీస్ బ్యానర్ లో తెరకెక్కిన ఈ సినిమాకి ఏకంగా 600 కోట్ల బడ్జెట్ పెట్టారు. నాగ్ అశ్విన్ డైరెక్షన్లో వచ్చిన ఈ మూవీలో ప్రభాస్, అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్,దీపికా పదుకొనే లాంటి దిగ్గజ నటులు నటించారు. అలా వీరి రెమ్యూనరేషన్లకే సగం బడ్జెట్ పోయింది అంటారు.

**ఆర్ఆర్ఆర్..** దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా మూవీ ఆర్ఆర్ఆర్.. ఈ మూవీలో ఎన్టీఆర్,రాంచరణ్ లు నటించడంతో సినిమాకి భారీ హైప్ వచ్చింది. అలా ఈ సినిమాకి 550 కోట్ల బడ్జెట్ పెట్టారు.

**ఆది పురుష్..** రామాయణ ఇతిహాస కథ ఆధారంగా తెరకెక్కిన ఆది పురుష్ మూవీకి ఏకంగా 550 కోట్ల బడ్జెట్ పెట్టారు.ఇందులో ప్రభాస్ రాముడి పాత్రలో నటించడంతో సినిమాకి ఎంత బడ్జెట్ అయినా సరే అని పెట్టేశారు.కానీ చివరికి సినిమా బాక్సాఫీస్ వద్ద బోల్తా పడింది. అలా నిర్మాత చాలా కోట్లు నష్టపోయారు.

**రోబో 2.0..** రజినీకాంత్ హీరోగా వచ్చిన రోబో సినిమాకు సీక్వెల్ గా రోబో 2.0 తెరకెక్కింది.అయితే రోబో మూవీకి మంచి రెస్పాన్స్ రావడంతో 2.0 కి కూడా భారీ అంచనాలు ఉన్నాయి. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. అలా ఈ మూవీకి ఏకంగా 550 కోట్లు పెట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

**పుష్ప-2:** సుకుమార్ డైరెక్షన్లో అల్లు అర్జున్ హీరోగా వచ్చిన పుష్ప2 కి 500 కోట్ల బడ్జెట్ పెట్టారు.. పుష్ప మూవీకి సీక్వెల్ గా వచ్చిన పుష్ప-2 ని భారీ అంచనాలతో తీసుకువచ్చి బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద హిట్ కొట్టారు. అలా ఈ సినిమా దాదాపు 1800 కోట్ల కలెక్షన్స్ సాధించింది.

**ది గోట్ :** తమిళ హీరో విజయ్ దళపతి హీరోగా వచ్చిన ది గోట్ మూవీలో ఈయన ద్విపాత్రాభినయం చేశారు. ఈ మూవీ కి మిక్స్ టాక్ వచ్చినప్పటికీ నిర్మాతలకు నష్టం రాలేదని తెలుస్తోంది. ఇక నిర్మాతలు ఈ మూవీకి 380 కోట్ల బడ్జెట్ పెట్టారు.

**బ్రహ్మాస్త్ర :** బాలీవుడ్ సెలబ్రిటి కపుల్ రణ్బీర్ కపూర్, అలియా భట్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన బ్రహ్మాస్త్ర మూవీకి ఏకంగా 350 కోట్ల బడ్జెట్ పెట్టారు.ఈ సినిమాలో విఎఫ్ఎక్స్ ని ఎక్కువగా వాడడం వల్ల ఇంత బడ్జెట్ ఖర్చయిందని అంటారు. త్వరలోనే ఈ మూవీకి సీక్వెల్ కూడా రాబోతోంది.

**గేమ్ ఛేంజర్:** రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన గేమ్ ఛేంజర్ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయం పాలైంది.ఈ సినిమాకి ఏకంగా 350 కోట్ల బడ్జెట్ పెడితే కనీసం 200 కోట్లు కూడా దాట లేదని ఇన్సైడ్ వర్గాల టాక్. అలా గేమ్ ఛేంజర్ వల్ల నిర్మాతలు భారీగా నష్టపోయారు.

**కూలీ:** రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన కూలీ మూవీకి కూడా దాదాపు 350 కోట్ల బడ్జెట్ పెట్టారు. ఈ సినిమాలో నాగార్జున,ఉపేంద్ర లాంటి దిగ్గజ నటులు కూడా నటించడంతో సినిమాకి భారీ హైప్ ఏర్పడింది.కానీ బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందన లభించింది. అయితే సినిమా మిక్స్ టాక్ తో కూడా 500 కోట్ల కలెక్షన్స్ దాటేసింది.

**వార్-2 :** ఎన్టీఆర్ మొట్టమొదటి బాలీవుడ్ ఫిల్మ్ వార్ 2.. హృతిక్ రోషన్,ఎన్టీఆర్ కాంబోలో వచ్చిన వార్-2 మూవీ 350 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కినప్పటికీ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ సాధించలేకపోయింది. ఈ సినిమాకి చాలా వరకు నష్టం వచ్చింది. అలా మన భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు హైయ్యెస్ట్ బడ్జెట్ పెట్టిన సినిమాలలో టాప్ 10 సినిమాలు ఇవే. అయితే ఇంతకంటే ఎక్కువ బడ్జెట్ తో త్వరలోనే మరో రెండు సినిమాలు రాబోతున్నాయి. అవే బాలీవుడ్ లో వస్తున్న రామాయణ..పాన్ వరల్డ్ లో వస్తున్న ఎస్ఎస్ఎంబి 29.. ఈ సినిమాలో బాలీవుడ్ నుండి వస్తున్న రామాయణ మూవీకి ఏకంగా 2000 కోట్ల బడ్జెట్ పెట్టగా.. మహేష్ బాబు నటిస్తున్న ఎస్ఎస్ఎంబి 29 మూవీకి 1200 కోట్ల బడ్జెట్ పెడుతున్నారట.

# అఖండ 2.. బాలయ్య కెరీర్ లోనే ఇది టాప్!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ వరుస హిట్లతో ఫుల్ జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ఆరు పదుల వయసులో కూడా తన సినిమాలతో అలరిస్తున్నారు. యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. ఇప్పుడు అఖండ-2 మూవీలో యాక్ట్ చేస్తున్నారు. స్టార్ అండ్ మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను.. ఆ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 2021లో వారిద్దరి కాంబినేషన్ లో వచ్చిన అఖండ.. ఓ రేంజ్ లో హిట్ అయింది. బాక్సాఫీస్ ను ఒక్కసారిగా షేక్ చేసింది. బాలయ్య కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. దీంతో అఖండ-2 అనౌన్స్మెంట్ రావడమే లేట్.. ఆడియన్స్ తో పాటు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్ అయితే వాటిని ఫుల్ గా పెంచేసింది. బాలయ్య, బోయపాటి కాంబోలో మరో బ్లాక్ బస్టర్ లోడింగ్ అని అంతా ఫిక్స్ అయ్యారు. అయితే దసరా కానుకగా సినిమాను సెప్టెంబర్ 25వ తేదీన రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. ఆ తర్వాత వాయిదా పడుతుందని వార్తలు వచ్చినా రెస్పాండ్ అవ్వలేదు. రీసెంట్ గా అనుకున్నట్లే మూవీ రిలీజ్ పోస్ట్ పోన్ చేశారు. డిసెంబర్ 5న రిలీజ్ చేస్తారని వార్తలు వస్తుండగా.. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ను కంప్లీట్ చేస్తున్నారు. అదే సమయంలో ఒప్పందాలను ఖరారు చేసుకుంటున్నారు. అయితే అఖండ-2 డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను పొందేందుకు పలు ఓటీటీ పడుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అమెజాన్ దక్కించుకుందని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు జియో హాట్ స్టార్.. అఖండ సీక్వెల్ రైట్స్ ను సొంతం చేసుకుందని సమాచారం. రూ.85 కోట్లకు దక్కించుకుందని తెలుస్తోంది. సంక్రాంతి సెలవుల సీజన్ లో డిజిటల్ స్ట్రీమింగ్ కు అందుబాటులో ఉండేలా డిసెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయాలని వారు జియో హాట్ స్టార్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారని వినికిడి. అయితే అదే జరిగేలా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయి. కాగా.. అఖండ-2 డిజిటల్ డీల్.. బాలయ్య కెరీర్ లో అతిపెద్ద ఒప్పందంగా తెలుస్తోంది. ఇటీవల కాలంలో తెలుగు చిత్రానికి జరిగిన అతిపెద్ద డిజిటల్ ఒప్పందాల్లో కూడా ఒకటని చెప్పాలి. ఏదేమైనా డివోషనల్ టచ్ తో యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై పై రామ్ ఆచంట, గోపి ఆచంట గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మరి ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# ఆ గ్యాప్ ను కీర్తి ఇలా కవర్ చేస్తుందా?

నేను శైలజ తో తెలుగు సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కీర్తి సురేష్ చైల్డ్ ఆర్టిస్టుగా కూడా పలు సినిమాలు చేశారు. తెలుగు లో చేసిన మొదటి సినిమానే మంచి హిట్ అవడంతో తర్వాత కీర్తికి వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. తక్కువ టైమ్ లోనే తెలుగులోని స్టార్లతో కలిసి నటించిన కీర్తి, మహానటి సినిమాలో సావిత్రిగా నటించి నేషనల్ అవార్డు కూడా అందుకున్నారు.

**వరుస సినిమాలను లైన్ లో పెట్టిన కీర్తి...** కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనీని ప్రేమించి పెళ్లి చేసుకున్న కీర్తి, పెళ్లి తర్వాత కాస్త స్పీడు తగ్గించిందని అందరూ అనుకున్నారు. పెళ్లికి ముందు ఒప్పుకున్న సినిమాలు తప్పించి కొత్త సినిమాలకు సైన్ చేయడం లేదని, పెళ్లైందని కీర్తికి ఆఫర్లు తగ్గాయా లేదా అమ్మడిని మెప్పించే కథలతో డైరెక్టర్లు ఆమెను సంప్రదించడం లేదా అని అందరూ అనుకుంటున్న టైమ్ లో కీర్తి మళ్లీ వరుసపెట్టి సినిమాలను లైన్ లో పెడుతున్నారు.



**విజయ్ దేవరకొండతో రౌడీ జనార్థన్...** సౌత్ లో స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్న కీర్తి సురేష్ ఇప్పుడు పలు భాషల్లో అద్భుతమైన లైనప్ తో ఆడియన్స్ ను అలరించడానికి రెడీ అవుతున్నారు. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి రౌడీ జనార్థన్ అనే రొమాంటిక్ యాక్షన్ మూవీ చేస్తున్న కీర్తి, హిందీలో ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ కోసం అక్క అనే పీరియాడికల్ డ్రామాను కూడా చేస్తున్నారు. కోలీవుడ్ లో మిస్కిన్ తో కలిసి ఓ కోర్టు రూమా డ్రామా చేస్తున్న కీర్తి, దాంతో పాటూ రివాల్వర్ రీటా కూడా చేస్తున్న సంగతి తెలిసిందే.

వీటితో పాటూ మలయాళ యాక్షన్ థ్రిల్లర్ తొట్టంలో కూడా కీర్తి కనిపించనున్నారు. చూస్తుంటే పెళ్లి తర్వాత వచ్చిన గ్యాప్ ను కీర్తి వరుస సినిమాలతో పూరించడానికే ఇలా సాలిడ్ లైనప్ తో రానుందని అనిపిస్తోంది. ఏదేమైనా రానున్న రోజుల్లో కీర్తి నుంచి పలు క్రేజీ ప్రాజెక్టులు రానున్నాయి.

# జాన్వీ కపూర్ స్థానం గూగుల్-ఏఐ కూడా దొరకలేదా?

బాలీవుడ్ లో జాన్వీ కపూర్ స్థానం ఎక్కడ? ర్యాకింగ్ లో అమ్మడు ఎన్నవ స్థానంలో ఉంది? అంటే గూగుల్ -ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో కూడా వెతుక్కోవాల్సిన పనిలేదు. జాన్వీ బాలీ వుడ్ కి ఎంట్రీ ఇచ్చి ఏడేళ్లు అవుతుంది. ఈ ఏడేళ్లలో జాన్వీ ఏం సాధించిందంటే? ఏం చెబుతాము? అన్నట్లే కనిపిస్తోంది సన్నివేశం. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్ లో దడక్ తో లాంచ్ అయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ చేసిన సినిమాలు 13. వాటిలో రెండు సినిమాలు గెస్ట్ అపీరియన్స్ లు తీసేస్తే 11.

**కలిసి రాని కాలం:** మరి వీటిలో ఎన్ని సినిమాలు విజయం సాధించాయంటే? చెప్పడం కష్టమే. ధడక్ యావరేజ్ గా ఆడింది. గుంజన్ సక్సేనా బయోగ్రఫీలో నటించినా వర్కౌట్ అవ్వలేదు. ఓ మంచి ప్రయత్నం చేసిందనే ప్రశంస తప్ప ఆ సినిమా ద్వారా జాన్వీ సాధించింది ఏం లేదు. మిగతా సినిమాల గురించి చెప్పాల్సిన పనిలేదు. అన్ని ఒకదానికొకటి పోటీ పడి మరీ ఫ్లాప్ రికార్డులు అందించిన



చిత్రాలే. టాలీవుడ్ లో దేవరతో లాంచ్ అయింది. ఇక్కడైనా గ్రాండ్ విక్టరీ కొట్టిందంటే? అదీ లేదు. దేవర డివైడ్ టాక్ తోనే నడించింది.

**జాన్వీ బ్రాండ్ ఎక్కడ?** ఎన్టీఆర్ ఇమేజ్ తో సోసోగా ఆడిన చిత్రం. మరి తంగ పాత్ర పరంగానైనా మార్క్ వేసిందా? అంటే అదీ లేదు. అమ్మడి పాత్రకు అందులో పెద్దగా స్కోప్ లేదు. పరిమితంగానే తెరపై కనిపించింది. ఓవరాల్ గా మొత్తం సినిమాలన్నింటి లో ఉత్తమ నటి అనే ప్రశంస ఏ సినిమాకైనా దక్కిందా? అంటే అదీ లేదు. కొంత మంది నటీమణులు నటించిన సినిమాలు పెయిలైనా పాత్రల పరంగా తమ ముద్ర వేస్తారు. జాన్వీ ఆవి షయంలో కూడా వెనుకబడే ఉంది.

**పెద్దిపైనే ఆశలన్నీ:** ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామ్ ఇమేజ్ తో- డాడ్ ప్రోత్భబ లంతో అవకాశాలు అందుకోవడం తప్ప జాన్వీ సాధించిందేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల రిలీజ్ అయిన పరమ్ సుందరి కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ఈ సినిమా పై జాన్వీ కూడా చాలా ఆశలే పెట్టుకుంది. కానీ అవన్నీ తప్పాయి. ఇక జాన్వీ చేతిలో ఉన్నది పెద్ది అనే పాన్ ఇండియా చిత్రం ఒక్కటే. ఈ సినిమాతోనైనా కపూర్ బ్యూటీ తన బ్రాండ్ వేస్తుందా? గూగూల్-ఏఐల్లో ర్యాంక్ ను రిజిస్టర్ చేస్తుందా? అన్నది చూడాలి.




## హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్న పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 7: మియాపూర్ అల్విన్ కాలనీ వద్ద హ్యాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సా నుండి హైదరాబాద్‌కు ఒరిస్సాకు చెందిన సోనియా అనే వ్యక్తి సప్లై చేస్తున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ టీం, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఒరిస్సాకు చెందిన సోనియా ప్రధాన సూత్రధారిగా తేల్చారు. సోనియాకు సహాయం చేస్తున్న ఆంధ్రప్రదేశ్కు చెందిన ముగ్గురు వ్యక్తులు లక్ష్మి, దుర్గ ప్రసాద్, దుర్గలను సైతం మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుపడ్డ వారి వద్ద నుండి 3 లక్షల విలువ చేసే 1.6 కేజీల హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మాదాపూర్ ఎస్ఓటీ టీం మియాపూర్ పోలీసులకు కేసు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత మూడు రోజుల క్రితం తాను అద్దె ఉంటున్న ఇంట్లోనే డ్రగ్స్ పెట్టుకొని సరఫరా చేస్తున్న జాన్‌పాల్ అనే డాక్టర్? ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని డ్రగ్స్ ఎక్స్పోర్ట్ చేయడం ప్రారంభించాడు. ఇలా వచ్చిన డబ్బును స్నేహితులకు ఇస్తూ, తాను డ్రగ్స్?ను ఉచితంగా వినియోగిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ఈ వ్యవహారం గుట్టు రట్టుచేశారు. నిందితుడి నుంచి రూ.3 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి రూ.3 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి, మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

## హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్.. వెబ్‌సైట్ ప్రారంభం




హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వెబ్‌సైట్ https://hisff.in/ వినియోగంలోకి వచ్చింది. సదరు వెబ్‌సైట్‌ను ఎఫ్‌డీసీ ఎండీ ప్రియాంక, ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత సంయుక్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్నవారు.. 3 సెకన్ల నుంచి 25 నిమిషాల పాటు నిడివి గల లఘు చిత్రాలను పంపాలని కోరారు. ఆయా వీడియోలను ఈ వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐమాక్స్ వేదికగా నిర్వహించనున్న వేడుకకు అంతర్జాతీయ ఆర్టిస్టులు, సాంకేతిక నిపుణుల హాజరవుతారని తెలిపారు. ముగింపు వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నవంబరు 14 నాటికి అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

## అడ్డగోలుగా ఫీజులు పెంచి.. రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. "మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా? రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండి" అని సీఎం అన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు



హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగానూ ఆయనపై చర్యలు తీసుకోవాలని పీసీసీ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సీఈవోకు ఫిర్యాదు చేసింది. గురువారం బోరబండలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొంది. "తులం బంగారం ఇచ్చుడు కాదు.. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే ఉన్న బంగారం గుంజుకెళ్తారు. సీఎం రేవంత్‌రెడ్డి.. ఒక్క కేసులో కూడా కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెట్టలేదు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి దోచుకున్న రాష్ట్రం ఏదైనా ఉందంటే అది తెలంగాణ" అని సంజయ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## డిసెంబర్ 19 నుంచి 21 వరకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీ సంస్థ ద్వారా డిసెంబర్ 19 నుంచి 21 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.30 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం ఈమేరకు జీవో విడుదల చేసింది.




హైదరాబాద్: క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్‌ధావన్‌పై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారని ప్రశ్నించారు. "బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారు. వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రచా రం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా..? సమాజ మేలు కోసం, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నాలుగు మంచి మాటలు చెప్పండి. అంతే కానీ మిమ్మల్ని అభిమానించే వాళ్లను తప్పుదోవ పట్టించి.. వారి ప్రాణాలను తీయకండి" అని ఎక్స్‌లో సజ్జనార్ పోస్టు పెట్టారు.

## బ్లాక్ మెయిలర్‌కు బుద్ధి చెప్పండి.. సీఎంపై హరీష్ సంచలన వ్యాఖ్యలు




హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు. బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని రేవంత్ చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్ అయ్యారు. చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సినీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు.

**అదే సీఎం రేవంత్ చరిత్ర..** జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు.

**సోదాలపై..** బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్ధన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమీషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు.

**క్షమాపణ చెప్పాల్సిందే...** బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అని ఆరోపించారు. ప్రధాని చెప్పిన ఆర్ఆర్ టాక్స్‌పై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడు వచ్చింది? ముస్లింలు ఎప్పుడు నుంచి ఉన్నారు అని నిలదీశారు. కాంగ్రెస్ లేకుంటే.. ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి కామెంట్స్ అన్యాయమన్నారు. ముస్లింలను రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు.




**హైదరాబాద్: నగరంలోని భారత రాష్ట్ర సమితి నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేసింది. మోతీనగర్‌లోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో, రెహమత్ నగర్‌లోని ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఇంట్లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కోసం భారీ ఎత్తున డబ్బు నిల్వ చేశారనే ఫిర్యాదులతో ఈ సోదాలు చేశారు. ఎన్నికల అధికారులతో పాటు కేంద్ర బలగాలు ఇందులో పాల్గొన్నాయి.**

## ఎన్నికల సమయంలో సోదాలు సహజం: పొన్నం



హైదరాబాద్: హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి నేతల ఇళ్లలో ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ సోదాలు చేపట్టింది. ఈ అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఎన్నికల సమయంలో సోదాలు సహజమని.. ఎవరి ఇంట్లో అయినా అధికారులు తనిఖీలు చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ పనిచేస్తుందని తెలిపారు. ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే సోదాలు చేయడం ఎన్నికల సంఘం హక్కు అని తెలిపారు. ప్రతిదాన్ని రాజకీయం చేయడం గులాబీ పార్టీ నేతలకు అలవాటైందని విమర్శించారు. ఇక జూబ్లీహిల్స్‌లో 10 వేల ఓట్లు కూడా భాజపాకు రావని పొన్నం ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి నియోజకవర్గంలోనే ఆ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో భాజపా-భారత రాష్ట్ర సమితి లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ధ్వజమెత్తారు.

## మద్యం ప్రియులకు షాక్.. నాలుగు రోజులు వైన్స్ బంద్




హైదరాబాద్, నవంబర్ 7: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో 4 రోజుల పాటు వైన్స్ బంద్ కానున్నాయి. నవంబర్ 9 సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 12 సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు మూసివేయనున్నారు. ఓట్ల లెక్కింపు రోజు నవంబర్ 14న ఉదయం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు, అవసరమైతే రిపోల్ రోజు కూడా మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20 ప్రకారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహంతీ ఆదేశాలు జారీ చేశారు. సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు సహా రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు, స్టార్ హోటల్స్, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లు మూసివేయనున్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 135-%జ% ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేయబడ్డాయని కమిషనర్ తెలిపారు. నవంబర్ 11న పోలింగ్ జరుగనున్న ఈ బైపోల్ లో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. అయితే ఈసారి ఇంత మంది ఎన్నికల్లో పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఇటీవల ఆయన హఠాన్మరణంతో ఈ ఉపఎన్నిక జరుగుతోంది. ఈ ఉపఎన్నికలో ప్రధాన పార్టీలు హోరాహోరీగా పోటీ పడుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తరపున నవీన్ యాదవ్ ఎన్నికల బరిలో నిలువగా.. బీఆర్ఎస్ పార్టీ తరపున మాగంటి గోపీనాథ్ భార్య, మాగంటి సునీత పోటీ చేయనున్నారు. బీజేపీ పార్టీ తరఫున లంకల దీపక్ రెడ్డి ఎన్నికల బరిలో నిలిచారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో గెలిచి మరోసారి తమ సత్తా నిరూపించుకోవాలని చూస్తోంది. తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించి పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు బీఆర్ఎస్ యోచిస్తోంది. అటు గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాల్లో విజయం సాధించిన బీజేపీ పార్టీ, ఈ స్థానంలో గెలిచి పార్టీ బలం మరింత పెంచే దిశగా కసరత్తు చేస్తోంది. ముగ్గురు అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ బైపోల్ లో ఎవరు గెలుస్తారనే ఆసక్తి నెలకొంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com